# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక వార్త




## రోడ్డు ప్రమాదంలో భర్త మృతి, భార్యకు తీవ్రగాయాలు

పుత్తూరు, అక్టోబరు 8 ప్రభాతవార్త :



పట్టణంలో పున్నమి బైపాస్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్య తీవ్ర గాయాలతో చికిత్స పొందుతోంది. మునిసిపాలిటీలోని ఒకటో వార్డు పరిధి మిట్టపల్లూరు గ్రామానికి చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి కృష్ణారెడ్డి (68), తన భార్య ఇరసమ్మ (58)తో కలిసి ద్విచక్ర వాహనంపై పుత్తూరుకు వచ్చారు. పని ముగించుకుని తిరిగి వెళుతూ... తిమ్మాపురంలోని తన తమ్ముడు ఇంటికి వెళ్లేందుకు జాతీయ రహదారిని దాటుతుండగా చెన్నై వైపు వెళుతున్న తమిళనాడు ఆర్టీసి బస్సు ఢీకొంది. ద్విచక్ర వాహనం బస్సు కింద ఇరుక్కుపోయింది. దాంతో కృష్ణారెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలపాలైన ఇరసమ్మను రుయాకు తరలించగా అక్కడ నుంచి స్విమ్స్‌కు పంపించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా వుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైతు భరోసా కేంద్రంతో
# రైతులకు కొండంత అండ

### రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్‌కె రోజా



ఆరూరులో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి ఆర్‌కె రోజా

నింద్ర, అక్టోబరు 8 ప్రభాతవార్త :

రైతు భరోసా కేంద్రంతో రైతులకు కొండంత అండ వుంటుందని రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రి ఆర్‌కె రోజా తెలిపారు. శనివారం మండలంలోని ఆరూరు సచివాలయ పరిధిలో రైతు భరోసా కేంద్రాన్ని యంపిపి దీపాజలంధర్‌రాజు అధ్యక్షతన, ముఖ్యఅతిథి రాష్ట్ర మంత్రి ఆర్‌కె రోజా ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు రైతులకు సకాలంలో అందజేయడానికి ప్రతి సచివాలయ పరిధిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాష్ట్రానికి ఎంతో మంది ముఖ్యమంత్రి వచ్చి వుండవచ్చును కానీ రైతుల గురించి ఇంతగా ఆలోచించిన వారు ఎవరు లేరని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా అవినీతి తావులేకుండా పేద ప్రజలకు చేరవలసిన పథకాలు నేరుగా డిబిటి పద్ధతిలో అందజేసిన ఘనత వైయస్ఆర్ కాంగ్రెసు పార్టీ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానులు తీసుకొని వస్తా వుంటే ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబునాయుడు 29 గ్రామాలే రాజధాని అని రియల్‌ఎస్టేట్ వ్యాపారస్థులకు మద్దతు తెలుపుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మండల వైకాపా కన్వీనర్ వేణురాజు, యంపిడిఓ వేణు, తహశీల్దారు అమరేంద్ర బాబు, హౌసింగ్ ఎఇ శ్రీధర్‌రాజు, పంచాయితీరాజ్ ఎఇ వీరభద్రం, యంపిటిసి విజేష్, సింగల్‌విండో చేర్మన్ మునిక్రిష్ణారెడ్డి, వైకాపా రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్, కో ఆప్షన్ మెంబర్ అనిల్, యంపిటిసి మంజుల, సర్పంచ్‌లు కేశవులు, రాజేష్ నాయకులు మహేష్, బాబురెడ్డి, నామాదేవరెడ్డి, మురళీనాయుడు, సుధాకర్, సత్యరాజ్, దామోదర్, వీరయ్యనాయుడు, కాంట్రాక్టర్ శరవణ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో పోటెత్తిన భక్తులు



దసరా సెలవులు...పెరటాసి మాసం మూడవశనివారంతో తిరుమలలో భారీగా భక్తులు ఉన్నారు. గత రెండురోజుల నుంచి పెరిగిన అనూహ్యభక్తుల రద్దీతో శనివారం సాయంత్రానికి 48గంటలు సర్వదర్శనానికి నిరీక్షిస్తున్నారు. అనూహ్య భక్తుల రద్దీతో కొండ కిటకిటలాడుతోంది. ఐదుకిలోమీటర్లు గోగర్భమ్ డ్యామ్ వరకు చేరాయి. ఏడుకొండలవాడ ఎక్కడున్నావయ్యా...తమకు నీ దర్శనమెప్పుడుస్వామీ అంటూ చేతులెత్తి మొక్కుతున్నారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి భక్తులకు అందుతున్న సౌకర్యాలు తెలుసుకుని అల్పాహారం అందించారు. ప్రభాతవార్తప్రతినిధి, తిరుమల

## శ్రీకాళహస్తీశ్వరాలయానికి
# భక్తుల రద్దీ

### పాతికవేల మంది దర్శనం



శ్రీకాళహస్తి, అక్టోబర్ 8 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి శనివారం రద్దీ పెరిగింది. తిరుమలేశుని సన్నిధిలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ముగియటంతో అక్కడకు వచ్చిన భక్తులు శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధికి వస్తున్నారు. అంతేకాక వరుస సెలవులతో భక్తుల తాకిడి పెరుగుతుంది. ఎటు చూసినా భక్త జనమే అన్నట్లుమారింది. సన్నిధివీధి అంతా జన మయంగామారింది. ఓ వైపు కాలినడకన వచ్చే భక్తులు మరో వైపు వాహనాల రద్దీతో కిట కిట లాడింది. అయితే భక్తుల కోసం నిర్మించిన కైలాససదన్‌ను ఇంకా గదులు ఇవ్వటం లేదు. జ్ఞాన ప్రసూనంబ సదన్‌లోని 27 గదులను ప్రోటోకాల్‌పేరుతో కొన్ని అధికారుల పేర్లతో కొన్ని పంచుకోవటంతో వచ్చిన సామాన్యభక్తుల తిప్పలు వర్ణనాతీతంగా మారింది. శనివారం అధికారికంగా దేవస్థానం జారి చేసినసమాచారం మేరకు 25 వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు తెలిపారు. రాహుకేతుదోష నివారణ పూజలకు కూడా సుమారు 4వేలు దాటాయి.. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వారాంతంలో తమిళనాడు, కర్నాటకలకు చెందిన భక్తుల సంఖ్య అదికంగా ఉంటుంది. అలాగే విఐపిలతాకిడి కూడా అధికంగానే ఉంటుంది. కానీ ఆలయానికి సమీపంలో జ్ఞాన ప్రసూనాంబ సదన్ పేరుతో 27 గదులు నిర్మించారు. అన్ని కారుచౌకగా ఇచ్చే ఏసిలు. అయితే గత కొంత కాలంగా ఈ గదులు కొన్ని ఆలయాధికారులు పంచుకోగా మరి కొన్ని చైర్మెన్ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి కేటాయిస్తున్నారు. సందట్లో సడేమియా అన్నట్లు అధికారుల, ప్రోటోకాల్ వివిధ శాఖల ప్రోటోకాల్ ముసుగులో గదులు కేటాయించుకున్నట్లు తెలిసింది. దాంతో వచ్చే భక్తులు, విఐపిల పరిస్తితి ఆగమ్యగోచరంగా మారింది.

# పోలీస్‌స్టేషన్ ఆవరణలో పేలుడు



పోలీసుస్టేషన్‌లో సీజ్ చేసిన వాహనం ధ్వంసం, పేలుడుకు సంబంధించిన ప్రదేశం

చిత్తూరు, గంగాధరనెల్లూరు, అక్టోబర్ 8 ప్రభాతవార్త:

జిడినెల్లూరు పోలీస్ స్టేషన్ ఆవరణలోని వేపచెట్టు కింద పాతిపెట్టబడిన నల్లమందు శనివారం ఒక్కసారిగా పేలింది. పోలీస్ స్టేషన్ ఆవరణలో పేలుడు సంభవించడంతో స్థానికులు పరుగులు తీశారు. ఈ పేలుడులో వేపచెట్టుకు ప్రక్కనే పార్కింగ్ చేసిన ఒక ద్విచక్రవాహనం దెబ్బతింది. స్టేషన్‌లోని పోలీసు సిబ్బంది ఈ పేలుడు నుండి సురక్షితంగా బయటపడ్డారు. వివరాలిలా వున్నాయి. జిడినెల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 2018 జూన్ నెలలో ఒక కేసుకు సంబంధించి 713 కేజీల నల్లమందు పట్టుబడింది. ఈ నల్లమందును పోలీసు అధికారులు అప్పట్లో నాశనం చేశారు. అయితే ఎఫ్ఎస్ఎల్ కోసం 250 గ్రాముల నల్లమందును పోలీసులు తమ వద్ద వుంచుకొన్నారు. ఎఫ్ఎస్ఎల్ పరిశీలన కోసం నల్లమందు పంపే ప్రక్రియ పూర్తి కావడంతో మిగిలిన నల్లమందును పోలీసులు స్టేషన్ ఆవరణలోని వేపచెట్టు కింద సిమెంటు కాంక్రీట్ వేసి పాతిపెట్టారు. ప్రస్తుతం ఈ చెట్టుకింద వుంచిన నల్లమందు ఒక్కసారిగా పేలింది. స్టేషన్‌లో పేలుడు జరిగిన విషయం తెలిసిన వెంటనే చిత్తూరు నగర డిఎస్పీ సుధాకర్‌రెడ్డి హుటాహుటిన జిడినెల్లూరు పోలీస్ స్టేషన్ చేరుకొన్నారు. పేలుడు జరిగి ప్రాంతంను పరిశీలించి ఇందుకు గల కారణాలను స్థానిక పోలీసులను అడిగి తెలుసుకొన్నారు. తహసిల్దారు ఇన్బనాథన్ పేలుడు జరిగి ప్రాంతానికి వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్పీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిడినెల్లూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగిన పేలుడుతో ఎవరికి ఎలాంటి నష్టం జరుగలేదని వివరించారు. 2018 జూన్ నెలలో ఒక కేసులో పట్టుబడిన గన్ పౌడర్‌ను పోలీసులు అప్పుడు నాశనం చేశారని ఎఫ్ఎస్ఎల్ పరీక్షల కోసం కొంత గన్‌పౌడర్‌ను పోలీసులు తమ వద్ద వుంచుకొన్నారన్నారు. మిగిలిన గన్ పౌడర్‌ను పోలీసులు పోలీస్ స్టేషన్ ఆవరణలోని చెట్టుకింద కాంక్రీట్ వేసి పూడ్చి పెట్టారని అయితే ఈ నల్లమందు ఇప్పుడు పేలిందన్నారు. ఈ ఘటనపై విచారణ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

# కుటుంబ డాక్టర్ విధానం 15 నుండి అమలు చేయండి

### -ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి



తిరుపతిరూరల్, అక్టోబర్ 08 ప్రభాతవార్త:

రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్య భద్రతకు మరింత భరోసాగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి ఈనెల 15 నుండి కుటుంబ డాక్టర్ విధానాన్ని అమలు చేస్తున్నారని, కుటుంబ డాక్టర్ విధానాన్ని పకడ్బందీగా అమలు జరిగేలా చూడాలని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అధికారులను ఆదేశించారు. శనివారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో కుటుంబ డాక్టర్ విధానం అమలుపై ప ముఖ్యమంత్రి, జిల్లా పరిషత్ చైర్మెన్ శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎపిఎంఐడిసి చైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి మాట్లాడుతూ విద్యా, వైద్యం, వ్యవసాయానికి ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి వైద్యులు సందర్శించేలా ఒక గొప్ప కార్యక్రమం కుటుంబ డాక్టర్ విధానం తీసుకొచ్చారని తెలిపారు. జిల్లాలో 435 వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్స్ ఏర్పాటు చేస్తున్నారని, ఇప్పటికే 385 కేంద్రాలు నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి గ్రామాన్ని నెలకు రెండుసార్లు తప్పనిసరిగా వైద్యులు సందర్శించాలన్నారు. ప్రజాప్రతినిధులుగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంతో మంది వ్యాధిగ్రస్తులకు వైద్యం అందని విధానాన్ని గమనించినట్లు తెలిపారు. వ్యాధిగ్రస్తులకు వైద్యులు అండగా నిలవాలన్నారు. నాడు - నేడు కార్యక్రమంతో ప్రభుత్వ వైద్యశాలలకు మహర్ధ దశ వచ్చిందని, కనీసం మూడునెలలకు సరిపోయే మందులు అందుబాటులో ఉన్నాయని తెలపడం సంతోషం అన్నారు. జడ్పి చైర్మెన్ శ్రీనివాసులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి తీసుకున్న ప్రతి నిర్ణయం అందరికి తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ లైన్స్‌క్లబ్ ప్రతినిధుల మ్మడి చిత్తూరు జిల్లాలో 100 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాట చేయుటకు నిర్ణయం తెలిపారన్నారు. కనీసం 50 సెంట్ల స్థలం అందించగలిగితే ఉచితంగా రోజుకు 36మంది పేషెంట్లకు వైద్యం అందిస్తారని తెలిపారు. ఎం.పి.గురుమూర్తి మాట్లాడతూ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి మన రాష్ట్రంలో అమలు చేస్తన్నారని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు వరప్రసాద్, కొనేటి ఆదిమూలం, డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, 104 అధికారి హనమంతురావు, డిపిఎం శ్రీనివాసరావు, డిఇవో శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

# వాడవాడలా అంతరిక్ష వారోత్సవాలు

### కార్యక్రమాల్లో పాల్గొన్న ముగ్గురు గవర్నర్లు - నేడు పాండిచ్చేరి సీఎం హాజరు - సినీనటులు, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు సైతం..



గుంటూరులో అంతరిక్ష విజ్ఞానంపై షార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శన



పుదుచ్చేరి అంతరిక్ష వారోత్సవాలలో పాల్గొన్న అక్కడి గవర్నర్ తమిళసై సౌందరరాజన్, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ తదితరులు

శ్రీహరికోట (తడ), అక్టోబర్ 8 ప్రభాతవార్త

శ్రీహరికోటలోని అంతరిక్ష శాస్త్రవేత్తలు ఈ సారి ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వీవీఐపీలు సైతం ఈ ఉత్సవాలలో పాల్గొంటూ ఇస్రోను అభినందిస్తున్నారు. రెండేళ్ల విరామం అనంతరం వరల్డ్ స్పేస్ వీక్-2022 ఈ నెల 4న మొదలైంది. వాస్తవానికి ఈ నెల 10 వరకు ఈ వారోత్సవాలు జరగాల్సి ఉండగా మరొక రోజు పెంచాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటికే తమిళనాడు రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి శ్రీహరికోటకు వచ్చి ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను ప్రారంభించారు. పాండిచ్చేరిలో అక్కడి గవర్నర్ తమిళసై సౌందరరాజన్ ఉత్సవాలు ప్రారంభించారు. మన రాష్ట్రంలోని పుట్టపర్తిలో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ఈ కార్యక్రమాలు ప్రారంభించి ప్రసంగించారు. పాండిచ్చేరి ముగింపు ఉత్సవాలలో అక్కడి ముఖ్యమంత్రి ఎన్ రంగస్వామి పాల్గొంటున్నారు. చెన్నైలో జరిగిన ఉత్సవాలలో తమిళనాడు రాష్ట్ర విద్యాశాఖమంత్రి హాజరయ్యారు. శనివారం తిరుపతి సమీపంలోని మంగంపేట మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో సుప్రసిద్ధ సినీనటుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంచు మోహన్‌బాబు స్పేస్ ఆన్ వీల్స్‌ను ప్రారంభించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ నాగరాజు తదితరులు హాజరయ్యారు. శ్రీహరికోట నుంచి డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ పాండిచ్చేరి తదితర ప్రాంతాలకు వెళ్లి ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలలో పాల్గొన్నారు. ఆయనతో పాటు అసోసియేట్ డైరెక్టర్, వివిధ డిప్యూటీ డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్లు ఆయా ప్రాంతాల్లో పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరుస్తూ అంతరిక్ష ప్రగతిని తెలియజేసే ఉపగ్రహ, వాహకనౌక నమూనాలను ఎగ్జిబిషన్ ద్వారా ప్రచారం చేస్తున్నారు. పలుచోట్ల డాక్యుమెంటరీ ప్రదర్శిస్తున్నారు. మొబైల్ వాహనం ద్వారా ఇస్రో పరిశోధన, అభివృద్ధికి సంబంధించిన అంశాలను పొందుపరిచారు. దాదాపు కార్యక్రమాలు జరుగుతున్న నాలుగు రాష్ట్రాల్లోనూ ర్యాలీలు జరిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమాల నుంచి ముగింపు కార్యక్రమాల దాకా ఘనమైన ఏర్పాట్లు చేసి అంతరిక్ష కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. మొత్తంమీద ఈ సారి ఇంత ఘనంగా అంతరిక్ష వారోత్సవాలు నిర్వహిస్తూ ఇస్రో, ముఖ్యంగా షార్ శాస్త్రవేత్తలు పలువురి అభినందనలు అందుకుంటున్నారు. ఇదిలావుంటే ఈ నెల 10న శ్రీహరికోటలో విద్యార్థుల సమక్షంలో సౌండింగ్ రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. సూళ్లూరుపేట, పరిసర ప్రాంతాలలోని పలు పాఠశాలల్లో ఇప్పటికే డ్రాయింగ్ వ్యాసరచన, వకృత్తం వంటి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసిన ఇస్రో అధికారులు, శాస్త్రవేత్తలు ఆదివారం ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఇప్పటికే విజేతలైన వారిని గుర్తించి ఉన్న కారణంగా రాకెట్ నమూనాలతో కూడిన మెమొంటోలను బహూకరించనున్నారు.

# నగరిలో టిడిపి జెండా ఎగరేయాల్సిందే..

### భానుప్రకాష్‌కు చంద్రబాబు నిర్ధేశం



పుత్తూరు, అక్టోబరు 8 ప్రభాతవార్త :

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నగరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడాలని... గెలుపే లక్ష్యంతో పనిచేయాలని ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్‌కు స్పష్టం చేశారు. నగరి నియో జకవర్గానికి సంబంధించి ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్ష సమావేశాల్లో భాగంగా శనివారం చంద్రబాబునాయుడుతో ముఖాముఖి కార్యక్రమంలో భానుప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరి నియోజకవర్గంలో గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా గెలుస్తామనే భావనతో... మితిమీరిన విశ్వాసంతో వ్యవహరించామని, వచ్చే ఎన్నికల్లో పక్కా ప్లాన్‌తో ఎన్నికలకు సిద్ధం కావాలని చంద్రబాబు చెప్పినట్టు భానుప్రకాష్ తెలిపారు. అందరినీ కలుపుకుని పోయి తన తండ్రి దివంగత నాయకుడు గాలి ముద్దుకృష్ణమనాయుడులా మంచి పేరు సంపాదించాలని సూచించారని తెలిపారు. ఇప్పటి నుంచే నియోజకవర్గంలో ఒక వైపు పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, మరో వైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా పార్టీ క్యాడర్‌ను సన్నద్ధం చేయాలన్నారని తెలిపారు. అలాగే నగరి నియోజకవర్గంలో జరిగిన బాదుడే...బాదుడు కార్యక్రమం, పార్టీ కమిటీల నియామకం, కార్యక్రమాల నిర్వహణ, సభ్యత్వ నమోదు అంశాలను సమీక్షించి చంద్రబాబునాయుడు సంతృప్తి వ్యక్తం చేశారని భానుప్రకాష్ తెలిపారు.

# భూ అక్రమ రిజిస్ట్రేషన్ల దందా కేసు విచారణ వేగవంతం

### పోలీసుల వలలో చిక్కిన సబ్ రిజిస్ట్రార్ ఆఫీసర్, తహసిల్దారు, ముగ్గురు విఆర్‌ఓలు - ఇప్పటికే 7 మందిని అరెస్టు చేసిన పోలీసులు - మరికొందరి పాత్ర వుందని పోలీసుల విచారణలో నిర్ధారణ

చిత్తూరు, అక్టోబర్ 8 ప్రభాతవార్త:

జిల్లా కేంద్రం చిత్తూరు పరిసరాల్లో జరిగిన భూ అక్రమ రిజిస్ట్రేషన్ల దందా కేసు విచారణను పోలీసులు ముమ్మరం చేశారు. ఈ కేసులో ఇప్పటికే భూ రిజిస్ట్రేషన్లకు పాల్పడిన ఏడు మంది వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా తాజాగా శనివారం ఈ కేసులో సంబంధం వున్నట్లు నిర్ధారణ కావడంతో చిత్తూరు సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ శ్రీధర్ గుప్తా, ఇది వరకు చిత్తూరు తహసిల్దారుగా విధులు నిర్వర్తించి ప్రస్తతం పుత్తూరు తహసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న ఐ.సుబ్రమణ్యం, ఇది వరకు చిత్తూరు రూరల్ మండలం దిగువమాసాపల్లి విఆర్‌ఓగా విధులు నిర్వర్తించిన ధనంజయ, ఇది వరకు కట్టమంచి విఆర్‌ఓగా విధులు నిర్వర్తించి ప్రస్తుతం జిడినెల్లూరు మండలం నందలూరు విఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్న ఎం.శివనారాయణ, చిత్తూరులో విఆర్‌ఓగా ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తూ ఇది వరకు ఇరువారం విఆర్‌ఓగా విధులు నిర్వర్తించిన కె.బాబులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ భూ అక్రమ రిజిస్ట్రేషన్ల దందా కేసు విచారణను పోలీసులు వేగవంతం చేయడంతో ఈ కేసులో అనేక మంది పాత్ర వున్నట్లు పోలీసులకు పక్కా సాక్షాధారులు లభించాయి. ఈ కేసులో సంబంధం వున్న నిందితులు జిల్లాలోని పలు ప్రాంతాల్లో అక్రమ భూ రిజిస్ట్రేషన్లకు పాల్పడి భారీ మొత్తం నిధులను స్వాహా చేసినట్లు పోలీసులు తేల్చినట్లు తెలుస్తోంది. త్వరలో ఈ కేసుకు సంబంధించి పోలీసులు మరికొంత మందిని అరెస్టు చేసే అవకాశం కన్పిస్తోంది. ఇటీవల చిత్తూరు కట్టమంచికి చెందిన ఓ బాధితుడు తమ భూమి అక్రమ రిజిస్ట్రేషన్ జరిగి కబ్జాకు గురైందని చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నగర డిఎస్పీ సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ నరసింహరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ నేతృత్వంలో ఎస్ఐ సుమన్, సిబ్బంది అనేక కోణాల్లో విచారించి అక్రమ భూ రిజిస్ట్రేషన్లకు పాల్పడిన వారిని గుర్తించారు. అక్రమ భూ రిజిస్ట్రేషన్లకు పాల్పడిన ఏడు మంది నిందితులను గుర్తించి చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు ఇది వరకే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అక్రమ భూ రిజిస్ట్రేషన్ల దందాకు పాల్పడిన ఏడు మంది నిందితులను పోలీసులు విచారించగా వీరు సులభ మార్గంలో అధిక డబ్బులు సంపాదించాలని నిర్ణయించి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న కొంతమంది అధికారులను లోబరచుకొని వారి ద్వారా రికార్డుల్లో ఎదో ఒక లోపం వున్న భూమిని గుర్తించడం, అలాగే సుదీర్ఘ కాలంలో చిత్తూరులో కాకుండా ఇతర ప్రాంతాల్లో నివసించే వారి ఆస్తులను గుర్తించడం చేసేవారు. ఆపై వారి భూమి రిజిస్ట్రేషన్ కావడానికి వున్న లోపాలను ఆసరాగా చేసుకొని కొంత మొత్తంను కాంట్రాక్టుగా తీసుకొని ఆ భూములకు సంబంధించి ఫేక్ డాక్యుమెంట్లను రూపొందించేవారు. ఈ భూములకు సంబంధించి అసలైన యాజమానులకు తెలియకుండా అక్రమ మార్గంలో ఈ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను జరిపించి పూర్తి చేసేవారు. ఈ కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల్లోని పలు రికార్డులను మార్పులు, చేర్పులు చేసేవారు. చిత్తూరు కట్టమంచిలో సర్వేనెం.459/1లో సుమారు 5 కోట్ల రూపాయల విలువైన భూమి 1981 సంవత్సరంలో బాధితుడి తండ్రి రిజిస్ట్రేషన్ చేసుకొన్నప్పటికీ అప్పటి నుండి రెవెన్యూ రికార్డులో ఎలాంటి మ్యుటేషన్ ప్రక్రియ జరుగలేదని తెలుసుకొన్న కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల్లోని కొంతమంది అవినీతి అధికారులను తమ గుప్పిట్లో పెట్టుకొని వారి సహాయ సహకారాలతో ఈ భూమిని ఇతరులపై రిజిస్ట్రేషన్ చేసినట్లు విచారణలో తేలింది.

## పంచాయతీ అప్పులు తీర్చడానికి మహిళా సర్పంచ్ రోడ్డుపై కూరగాయల అమ్మకాలు

పాలసముద్రం, అక్టోబర్ 8 ప్రభాతవార్త:



పంచాయతీ ఎన్నికల్లో గ్రామ పంచాయతీ ప్రథమ పౌరురాలు, సర్పంచ్‌గా ఎన్నికైన పాలసముద్రం మండలం క్రిష్టజిమ్మాపురం పంచాయతీ సర్పంచ్ భానుప్రియ పంచాయతీ అప్పులు తీర్చడం కోసం రోడ్లపై కూరగాయాల అమ్మకానికి శ్రీకారం చుట్టారు. రెండేళ్ళ క్రితం జరిగిన పంచాయతీ ఎన్నికల్లో క్రిష్ణజిమ్మాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవి ఎస్సీ మహిళలకు రిజర్వ్ కావడంతో ఈ పంచాయతీ నుండి సర్పంచ్‌గా దళిత మహిళ భానుప్రియ ఎన్నికయ్యారు. పంచాయతీ పరిధిలోని ప్రజల సమస్యలను తీర్చడానికి శ్రీకారం చుట్టిన సర్పంచ్ భానుప్రియ మంచినీటి బోరు మరమ్మత్తులు, వీధి దీపాల ఏర్పాటు, మురికి కాలువల శుభ్రపరచడం తదితర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అయితే పంచాయతీలో నిధులు లేకపోవడం, ఇటీవల కేంద్రం ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసిన 14, 15 ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ విద్యుత్ బకాయిలకు సర్దుబాటు చేసుకోవడంతో క్రిష్ణజిమ్మాపురం పంచాయతీకి ఆర్థిక ఇబ్బంది మరింత ఎక్కువైంది. మరోవైపు గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం సర్పంచ్ భానుప్రియ చేసిన అప్పులు తిరిగి చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆమె కూరగాయల అమ్మకాలు చేపట్టారు. సర్పంచ్ భానుప్రియ మాట్లాడుతూ తాను తెలుగుదేశం మద్దతులో పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందడం జరిగిందని, గెలిచిన అనంతరం పంచాయతీలో నిధులు లేకపోవడంతో అప్పులు చేసి పలు కార్యక్రమాలు చేపట్టానని ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బకాయిల చెల్లింపు పేరుతో పంచాయతీలకు ఎగనామం పెట్టిందని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సత్వరం విడుదల చేసి ఆర్థిక ఇబ్బందుల్లో వున్న పంచాయతీలకు ఊరట కల్పించాలని ఆమె కోరారు.

## లక్ష్మీపురంలో తాగునీటికై నూతన బోరు ప్రారంభం

కుప్పంరూరల్, అక్టోబర్ 8 ప్రభాతవార్త



కుప్పం మున్సిపల్ పరిధి 25వ వార్డు లక్ష్మీపురంలో మంచినీటి సమస్య పరిష్కారంకు కౌన్సిలర్ మణి చొరవ చూపారు. ఈప్రాంతంలో నీటి సమస్య నెలకొనడంతో నూతనంగా బోరు వేయించారు. శనివారం బోరుకు కొత్తపంపు సెట్ వేయించి బోరును ప్రారంభించారు. నీటి సమస్య తీర్చడం పట్ల ప్రజలు కౌన్సిలర్ మణికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోదండ శ్రీను, శ్యామ్, లక్ష్మణ్, గణేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు చిత్తూరు నియోజకవర్గంలో డిప్యూటీ సిఎం, మంత్రి పర్యటన

చిత్తూరు, అక్టోబర్ 8 ప్రభాతవార్త:

డిప్యూటీ సిఎం నారాయణస్వామి, జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు ఆదివారం చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల్లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి శ్రీకారం చుట్టనున్నారు. డిప్యూటీ సిఎం, జిల్లా మంత్రి ఆదివారం ఉదయం 9 గంటలకు చిత్తూరు చేరుకొని తాణా చెక్‌పోస్టు వద్ద నిర్మించిన రోడ్డు ప్రారంభించి, తాళంబేడు చెక్‌పోస్టు, కృష్ణాపురం వద్ద రోడ్లను ప్రారంభిస్తారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. అనంతరం పాలూరులో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, బిఎన్‌ఆర్ పేటలో గ్రామ సచివాలయాలను ప్రారంభిస్తారన్నారు. గుడిపాల మండలంలో రామాపురం రోడ్డు, నారగల్లులో సచివాలయం, వైఎస్‌ఆర్ రైతు భరోసా కేంద్రం, వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్, సిఎం కండ్రి, గొల్లపల్లిల్లో రోడ్లను ప్రారంభిస్తారన్నారు. అలాగే 197 రామాపురంలో గ్రామ సచివాయం, వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్, కమ్మతిమ్మపల్లి, రాగిమానుపట్టెడ, రామాపురంల్లో రోడ్లు ప్రారంభిస్తారన్నారు. అలాగే వసంతాపురంలో గ్రామ సచివాలయం, వైఎస్‌ఆర్ రైతు భరోసా కేంద్రం, వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్, 189 కొత్తపల్లిలో గ్రామ సచివాలయం, ఆరుళ్‌పురం రోడ్లను డిప్యూటీ సిఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు ప్రారంభిస్తారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్సీ భరత్, పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని ఎమ్మెల్యే తెలిపారు.

## ఎన్టీఆర్ యుగపురుషుడు..ప్రజలే గుణపాఠం చెబుతారు

### - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

గుడుపల్లె, అక్టోబర్ 8 ప్రభాతవార్త



దివంగత ఎన్టీఆర్ యుగపురుషుడని అలాంటి వ్యక్తి పేరును హెల్త్ వర్సిటీకి తొలగించడం దారుణమని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం గుడుపల్లెలో దేశం శ్రేణులు రిలే నిరాహారదీక్ష చేపట్టాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి సిఎం అయ్యాక ఏం అభివృద్ధి జరిగిందని ప్రశ్నించారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని కుప్పంలో తమపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి జైలుకు పంపారని తాము హత్యలు చేసేవారమా కాదా అనేది ప్రజలకు తెలుసన్నారు. తప్పుడు కేసులకు తాము భయపడే ప్రసక్తే లేదన్నారు. వైకాపా ప్రభుత్వంకు రోజులు దగ్గరపడ్డాయన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. కుప్పంలో ఈసారి చంద్రబాబుకు అఖండ మెజార్టీ సాధించడం ఖాయమన్నారు. 2024లో మరలా చంద్రబాబు సిఎం కావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, చంద్రబాబు కార్యదర్శి మనోహర్, రాష్ట్ర నేతలు గోపీనాథ్, జిఎం రాజు, మండల పార్టీ అధ్యక్షుడు బాబునాయుడు, నేతలు హేమాంబర గౌడు, సాంబశివం, డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, శాంతారాం, మంజునాథ్, ఆర్ముగం, త్రిలోక్,సుబ్బు, తెలుగుయువత అధ్యక్షుడు మణి, రామచంద్ర, సంజీవరాజులు నాయుడు, బగ్గిడి వెంకటేష్, మురుగేష్,రాజగోపాల్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## తిరుణామలై బస్సు సర్వీసుకు విశేష స్పందన

చౌడేపల్లి, అక్టోబర్ 8 ప్రభాతవార్త

తమిళనాట ప్రసముఖ శైవక్షేత్రం తిరుమణామలైకు ఈనెల 9న పౌర్ణమి గిరి ప్రదక్షణ వుంది. ఈ క్రమంలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భక్తుల కోరిక మేరకు పుంగనూరు డిపో నుంచి ఆర్టీసీ సర్వీసును ప్రారంభించి, రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. దీంతో ఒక్క రోజులోనే బస్సుకు సరిపడా టిక్కెట్లు అమ్ముడు పోయాయని డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. దీంతో 2వ సర్వీసును వేసినట్లు ఆయన తెలిపారు. అంతే కాకుండా చౌడేపల్లి, సోమల ప్రాంతాల భక్తులకు సైతం రాబోయే రోజుల్లో తిరువణామలైకు ఆర్టీసీ సేవలు నడుపుతున్నట్లు ఆయన వివరించారు.

## గంజాయిస్వాధీనం: వ్యక్తి అరెస్టు

పుంగనూరు, అక్టోబరు 8 ప్రభాతవార్త :



కర్నాటక నుంచి పట్టణానికి అక్రమంగా తరలిస్తున ్న 8కిలోల గంజాయిని పుంగనూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. సిఐ గంగిరెడ్డి, ఎస్ఐ మోహన్‌కుమార్‌లతో పాటూ స్థానిక డాన్‌బాస్కో చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న తరుణంలో శనివారం ఉదయం కర్నాటక బేతమంగళంకు చెందిన వాహిద్‌షరీఫ్ అనే వ్యక్తి తన ద్విచక్రవాహనంలో వస్తూ అనుమానస్పద స్థితిలో కనుపించాడు. వాహనాన్ని వెంబడించి అతనిని అడ్డుకోవడంతో వాహనంలో 8కిలోల గంజాయి కనుగొన్నారు. ఈమేరకు నిందితుడిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచారు. గంజాయి విలువ రూ.48వేలు ఉంటుందని, వాహనాన్ని సీజ్‌చేసి కేసు దర్యాప్తుచేస్తున్నామని సిఐ వివరించారు.

## నేడు వాల్మీకి విగ్రహావిష్కరణ

పుంగనూరురూరల్, అక్టోబరు 8 ప్రభాతవార్త :

పట్టణంలో ఆదివారం ఉదయం వాల్మీకిమహర్షి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు రాష్ట్రవాల్మీకి సంఘ నాయకుడు,విశ్రాంత డిఎస్పీ సుకుమార్‌బాబు తెలిపారు. వాల్మీకులను ఎస్టీల జాబితాలో చేర్చాలని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున ్న తరుణంలో వాల్మీకులు ఎక్కువగా నివసిస్తున్న పట్టణంలో విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వాల్మీకులు తరలిరావాలని ఆయన కోరారు.

## గణనాధుని సన్నిధిలో తెలంగాణా మంత్రి

కాణిపాకం, అక్టోబర్ 8 ప్రభాతవార్త:

తెలంగాణా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ వికలాంగుల శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ శనివారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన మంత్రికి ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## భారత్ జోడో యాత్రలో పాల్గొనే వారు పేర్లను నమోదు చేసుకోండి

కాణిపాకం, అక్టోబర్ 8 ప్రభాతవార్త:

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో పాల్గొనే వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని పూతలపట్టు నియోజవర్గం పీసీసీ డెలిగేట్ సభ్యుడు ఏపీ పరదేశి అలియాస్ వినాయక్ తెలిపారు. కర్నాటకలో జోడో యాత్ర నిర్వహిస్తున్న రాముల్‌గాంధీ త్వరలో ఏపీలో యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈయాత్రలో పాల్గొనే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. అసక్తి వున్న నాయకులు, కార్యకర్తలు 9014385038 నెంబర్‌కు కాల్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని వినాయక్ కోరారు.

## సాంబశివారెడ్డికి డాక్టరేట్ ప్రదానం

కుప్పం, అక్టోబర్ 8 ప్రభాతవార్త



ద్రవిడ విశ్వవిద్యాలయంలోని బయో టెక్నాలజీ విభాగంలో సాంబశివారెడ్డి చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ నాగేశ్వరరావు తెలిపారు. రామకుప్పం మండలం గూళిపల్లికి చెందిన సంపంగిరెడ్డి కుమారుడు చెంచుల సాంబశివారెడ్డి ఆచార్య లోకనాథ వల్లూరు పర్యవేక్షణలో స్క్రీనింగ్ అండ్ ఎవాల్యుయేషన్ ఆఫ్ యాంటీ థైరాయిడ్ యాక్టివిటీ ఆఫ్ మెరైన్ మాక్రో ఆర్గానిజమ్స్ ఇన్ మేతిమజోల్ ఇన్‌డ్యూస్డ్ ర్యాట్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధక పత్రానికి డాక్టరేట్ ప్రదానం చేశామన్నారు. డాక్టరేట్ పొందిన సాంబశివారెడ్డిని వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది, స్కాలర్లు అభినందించారు.

## చెన్నై- షిర్డీ ఎక్స్‌ప్రెస్‌కు స్టాపింగ్ ఇవ్వాలి

కుప్పం, అక్టోబర్ 8 ప్రభాతవార్త



చెన్నై- షిర్డీ మధ్య తిరిగే సాయినగర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు కుప్పంలో స్టాపింగ్ ఇవ్వాలని సాయిమాతా సేవా ట్రస్ట్ జగదీష్‌బాబు రైల్వే డిఆర్ఎం శ్యామ్ సింగ్‌కు వినతిపత్రం అందించారు. చిత్తూరు ఎంపి రెడ్డెప్ప కుప్పంలో షిర్డీ రైలు ఆపాలని, అలాగే కుప్పం రైల్వే స్టేషన్‌లో ఎస్కవేటర్ ఏర్పాటుచేయాలని, గుడుపల్లె, మల్లానూరులో ఆర్ఒబిలు నిర్మించాలని కోరుతూ రాసిన లేఖను డిఆర్ఎంకు అందించారు. దీనిపై డిఆర్ఎం స్పందించి షిర్డీ రైలు స్టాపింగ్‌కు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో విశ్వనాథరెడ్డి, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

రామకుప్పం, అక్టోబర్ 8 ప్రభాతవార్త

ద్విచక్రవాహనంకు ఎదురుగా గొర్రెలు అడ్డుగా రావడంతో టువీలర్‌లో ప్రయాణిస్తున్న వ్యక్తి కిందపడి గాయాలపాలయ్యాడు. రామకుప్పం మాజీ సర్పంచ్ రామకృష్ణప్ప ద్విచక్రవాహనంలో బైపాస్ రోడ్డులో వస్తుండగా గొర్రెలు అడ్డంగా చొరబడ్డాయి. దీంతో అతను వాహనంనుంచి కిందపడి గాయాలపాలయ్యాడు. అధికారులు స్పందించి రోడ్లపై ప్రమాదాలకు కారణమవుతున్న కుక్కలు, గొర్రెల సంచారం లేకుండా చూడాల్సి ఉంది.

## ఉచిత కంటిఆపరేషన్లకు 22మంది ఎంపిక

కుప్పంరూరల్, అక్టోబర్ 8 ప్రభాతవార్త



పిఇఎస్ వైద్యకళాశాల, కుప్పం లయన్స్ క్లబ్ అధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. 103మందికి కంటి పరీక్షలు జరిపి వారిలో 22మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. అనంతరం లయన్స్ క్లబ్‌చే మా టివి సూపర్ సింగర్ జూనియర్ 2022 విజేత సుదీక్షకు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డా॥ మహేష్, డైరెక్టర్లు దశరథ్, లెనిన్, మతీన్, సురేష్, శివ,కర్ణ, కళ్యాణ్ ఫౌండేషన్‌ఛైర్మన్ పవన్‌కళ్యాణ్‌లు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

సూళ్లూరుపేట,కోట,వెంకటగిరి ,బాలాయపల్లి దొరవారిసత్రం,

## టిడిపి నాయకుల రిలే నిరాహార దీక్షలు



వాకాడు, అక్టోబర్ 8, ప్రభాతవార్త

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం దివంగత ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పేరును తొలగించడం పట్ల నిరసనగా వాకాడు అశోక పిల్లర్ సెంటర్‌లో తెలుగు దేశం పార్టీ నాయకులు శనివారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వాకాడు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దువ్వూరు మధుసూధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధిలో వెనకబడిపోయిందని ఆయన విమర్శించారు. రైతులను దగా చేస్తున్నారని దుయ్యపట్టారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అఖండ విజయం రావడం ఖాయమన్నారు. ఇప్పటికైనా ప్రజల్లో మార్పును చూసి హెల్త్ యూనివర్సిటి ఎన్టీఆర్ పేరును ఉంచాలని అన్నారు. ఈ దీక్షలో తెలుగు దేశం పార్టీ నాయకులు మామిడి గోవిందయ్య, కోట శ్రీనివాసులు, తిరుమూరు శ్రీనివాస రెడ్డి, కుంచం దయాకర్, యువనాయకుడు పంత్రంగం అరుణ్, తీవలపుడి రమణయ్య, వై. రమణయ్య, అన్నమేటి చంద్రయ్య, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిట్టేడు కోదండరామస్వామి ఆలయాన్ని పునరుద్ధరిస్తాం

కోట, అక్టోబర్ 8 ప్రభాతవార్త



కోట మండలం చిట్టేడు గ్రామంలోని కోదండరామస్వామి ఆలయ పునరుద్ధరణ, ధ్వజ స్తంభం నిర్మాణం, ప్రహరీ గోడలు, కోనేరు పునరుద్ధరణ పనులు చేయిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి చెప్పారు. శనివారం చిట్టేడు గ్రామంలో ఆయనతో పాటు బీజేపీ జిల్లా కార్యాలయ ఇన్‌ఛార్జ్ వెంకటముని, జనరల్ సెక్రటరీ వరప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పనబాక కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు పాదర్తి కోటారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పామంజి కృష్ణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సత్తెన అంబరీష్, మండల బీజేపీ అధ్యక్షులు సారంగం రమేష్‌బాబు పర్యటించారు. పూర్వం నిర్మించిన శ్రీ కోదండరామస్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో పునరుద్ధరణ కార్యక్రమానికి శ్రీకారం చుడతామని చెప్పారు. మండల ప్రధాన కార్యదర్శి విశ్వనాథం, ఉపాధ్యక్షులు తిరుపాలయ్య, యువమోర్చా నికేష్ పరశురామ్, జొక్కా తిరుపాలయ్య, గురవయ్య, వెంకటకృష్ణయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## గోవింద నామస్మరణతో మారుమ్రోగిన కలికిరికొండ

పెనుమూరు అక్టోబర్ 8 ప్రభాతవార్త:

పెరటాసి నెల మూడవ శనివారం సందర్భంగా మండలంలోని కలికిరికొండపై వెలసి వున్న వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాలయంలోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి చిత్రపటానికి ఆలయ ప్రధాన అర్చకులు వాసుదేవాచార్యులు పంచామృత అభిషేక సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు కంకుమార్చన, మంత్రపుష్ప పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారి పాదాల మండపం వద్ద మహిళలు పిండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకొన్నారు. ఉభయదారులు వాసుదేవపురం గ్రామస్తులు వ్యవహరించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ ఆలయంను టిటిడిలో విలీనం చేసి రెండేళ్ళు గడుస్తున్నప్పటికీ ఇంత వరకు ఆలయ జీర్ణోద్ధారణ పనులు చేపట్టకపోవడం విచారకరమన్నారు. వెంటనే ఆలయం పనులు చేపట్టి స్వామి వారి దర్శన భాగ్యం కల్పించాలని వారు కోరారు.

## తమిళనాడు సరిహద్దు గ్రామాల్లో పెరటాశి నెల శనివారం ఉత్సవాలు

తడ, అక్టోబర్ 8 ప్రభాతవార్త

తమిళనాడు సరిహద్దుల్లోని తడ మండల గ్రామాల్లో శనివారం పెరటాశి నెల ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తమిళులకు ముఖ్యమైన పెరటాశి మాసాన్ని తిరువణి నెలగా చెప్పుకుంటారు. ఈ నెల మొత్తం మాంసాహారం ముట్టకుండా విశేష పూజలు చేసే కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. నెలలో ఎన్ని శనివారాలు వస్తే అన్ని శనివారాలు శ్రీవేంకటేశ్వరస్వామిని పూజించి సాంప్రదాయం ఉంది. ముఖ్యంగా మూడవ శనివారం అంటే ఈ నెలలో మధ్యరోజులు కాబట్టి ప్రతి ఇంటా పూజలు జరుపుకుంటారు. ఈ శనివారం కూడా ఈ మూడవ వారం అనేక వైష్ణవాలయాల్లో ఉదయం నుంచే అభిషేకాలు, గోపూజలు నిర్వహించారు. చినమాంబట్టులోని అన్నదాన సమాజం వద్ద గోపూజతో పాటు ఆయుర్వేద మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఇక్కడి కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణదేవి ఆలయ సమీపంలో స్విమ్స్ వైద్యులు డాక్టర్ మునుస్వామి ఆధ్వర్యాన అన్నదానం కోసం ఒక భవనాన్ని నిర్మించి ఉన్నారు. అక్కడ ఆలయ ప్రధాన అర్చకులు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఆములూరు నాగరాజకుమారి జ్ఞాపకార్థం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి ధర్మ ప్రచార పరిషత్ వారిచే హరికథా కాలక్షేపం ఏర్పాటు చేశారు. సోమసుందరం మహర్షి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు మునుస్వామి, మునిశేఖర్, మురళీధర్‌ల ఆధ్వర్యాన వందమందికి పైగా రోగులను పరీక్షించి ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ మునిశ్రీనివాసులు, అన్నదానం ట్రస్టు ఛైర్మన్ చిల్లకూరు దేవేంద్రరెడ్డి, వాసు, మునిరామయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. తడ, తడకండ్రిగ, చేనిగుంట, అక్కంపేట, వెండ్లూరుపాడు, వేనాడు తదితర చోట్ల వేంకటేశ్వర ఆలయాల్లో శనివారం పూజలు ఘనంగా జరిపారు.



తడ మండలం చినమాంబట్టులో గోపూజలో పాల్గొన్న గ్రామపెద్దలు

## ప్రభుత్వ పథకాలు అందరికీ అందించండి

### - గడప గడప కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవయ్య

తడ, అక్టోబర్ 8 ప్రభాతవార్త



గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి అందించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు కిలివేటి సంజీవయ్య ఆదేశించారు. శనివారం ఆయన తడ మండలం బోడిలింగాలపాడు, అగ్రహారం, తడ కండ్రిగ ప్రధాన గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల లబ్ధిదారులతో, వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో ఆయన మాట్లాడారు. పల్లెల్లో సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యతను గుర్తు చేశారు. గడప గడపకు కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన సమస్యలను కూడా సత్వరం పరిష్కరించాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల గురించి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులతో పాటు మండలాధ్యక్షుడు కొళవి రఘురెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ గండవరం సురేష్‌రెడ్డి, సర్పంచ్ టి.జయప్రద, వైసీపీ నాయకులు కొమ్మల శేఖర్‌బాబు, ఉచ్చూరు మునుస్వామిరెడ్డి, నాగరాజారెడ్డి, రాజకుమార్, మహేశ్వర్, శశికుమార్, ఆఫ్రిది, ఆర్‌కె సుందరం, టి.కోదండం తదితరులు పాల్గొన్నారు.

## రాయలవారి కోటను సందర్శించిన "నటి గౌతమి"

చంద్రగిరి, అక్టోబర్ 8 ప్రభాతవార్త:



చారిత్రాత్మక చంద్రగిరి రాయలవారి కోటను ప్రముఖ సినీ నటి ఒకనాటి అగ్ర హీరోయిన్ గౌతమి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెకు మ్యూ జియం అధికారులు రాయలవారి కోట, మ్యూజియంలోని వస్తువుల విశిష్టతలు వివరించారు. కోటను సందర్శించిన ఆమెతో ఫోటోలు దిగేందుకు స్థానికులు, పర్యాటకులు పోటీపడ్డారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాయలవారి కోట అంటే కట్టడాలు మాత్రమే అనుకున్నట్లు తెలిపారు. అయితే ఇక్కడ వెలకట్టలేని విలువైన శిలా సంపద వున్నట్లు గ్రహించానన్నారు. రాయలవారి కాలం నాటి సంస్కృతీ సంప్రదాయాలు స్పష్టంగా గోచరిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడి చరిత్రను యావత్ ప్రజానికాని తెలియజేయాల్సివుందన్నారు. రాజకీయ ప్రవేశంపై స్పందిస్తూ ఒకవైపు అవకాశాలు, మరో వైపు బాధ్యతలు వుంటాయన్నారు. అయితే తాను వున్న ప్రదేశంలో వీలేనంత మందికి సేవ చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు.

## మహిళ ఆత్మహత్య

ఓజిలి, అక్టోబర్ 8 ప్రభాతవార్త



ఓజిలి మండలం పెద్దపరియ గ్రామానికి చెందిన పంది కమలమ్మ (45) అనే మహిళ శనివారం చీరతో బాత్‌రూమ్‌లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు, గత కొద్దిరోజులుగా కమలమ్మ మానసికంగా ఇబ్బంది పడుతుండేదని తెలిపారు. మృతురాలి భర్త పంది దశరథరామయ్య ఆత్మహత్య విషయమై పోలీసులకు సమాచారం అందించారు. ఓజిలి ఎస్ఐ ఆదిలక్ష్మి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీ వేంకటేశ్వరునికి శాకాంబరి అలంకారం

సూళ్లూరుపేట, అక్టోబర్ 8 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని శ్రీమద్వేంకట రామ్మూర్తి దేవస్థానంలో పెరటాశి నెల మూడో శనివారాన్ని పురస్కరించుకొని శ్రీ వేంకటేశ్వరస్వామి శాకాంబరి అలంకారాన్ని చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి వివిధ రకాల పండ్లు, కూరగాయలతో అలంకారం కన్నులపండువగా చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి మహిళా బృందంచే కోలాట ప్రదర్శనలు నిర్వహించారు. దేవస్థానం మేనేజింగ్ ట్రస్టీ బీరక రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో ఛాంపియన్ విద్యార్థుల ప్రతిభ

సూళ్లూరుపేట, అక్టోబర్ 8 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని ఛాంపియన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ట్రిపుల్ ఐటీ ప్రవేశ పరీక్షలో విశేష కనబరిచారు. నేహా నూజివీడు కాలేజికి, కె.చరిష్మా ఒంగోలు కాలేజికి, ఎం.మునిసాయి ఆర్‌కే వ్యాలీకి, జి.ప్రణతి ఇడుపులపాల కాలేజీకి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. తమ హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి ట్రిపుల్ ఐటీ కాలేజీలకు ప్రవేశం పొందడం పట్ల హైస్కూల్ ప్రిన్సిపాల్ రవీంద్రకుమారి హర్షం వ్యక్తం చేశారు. ఇదేవిధంగా తమ హైస్కూల్ నుంచి గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న ప్రవేశ ఫలితాల్లో మంచి ఫలితాలు సాధిస్తున్నారని ఆమె పేర్కొన్నారు.

వార్త VAARTHA CLASSIFIEDS
TO LET OR RENT
★ 40 CENTS OF COMMERCIAL LAND for rent on Bangalore Bypass (Near vakulamaatha temple) Mob. no.+919381299958
(Ro.No.32972)
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

# తిరుపతి డివిజన్

## ఏ.రంగంపేట వీఆర్ఏ ఆగడాలను నిలువరించండి..!

చంద్రగిరి, అక్టోబర్ 8 ప్రభాతవార్త: అయ్యా.. ఆరేపల్లి రంగంపేట వీఆర్ఏ వెంకటరమణ ఆగడాలను నిలువరించాలని కోరుతూ శనివారం డ్వాక్రా సంఘం మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద వారు మాట్లాడుతూ మహశ్వరీ మహిళా సంఘంలో ఆదెమ్మ సభ్యురాలు కాగా ఆమె భర్త వెంకటరమణ సంఘం వ్యవహారాలలో కలుగజేసుకుంటూ ఉన్నతాధికారులకు తప్పుడు ఆరోపణలతో ఫిర్యాదు చేస్తూ తమపై బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదెమ్మ గడచిన రెండేళ్ళుగా సంఘం సమావేశాలకు హాజరు కావడంలేదన్నారు. దీంతో ఆమె సంఘం నుండి తొలగిస్తూ తీర్మాణం చేయడం జరిగిందన్నారు. దీంతో తమపై కక్షగట్టి తమపై చేసిన ఫిర్యాదుల సంఘంలో అక్రమాలు జరుగుతున్నట్లు పదే పదే తప్పుడు ఫిర్యాదులు చేస్తూ తమకు బ్యాంకు రుణాలు రాకుండా అడ్డుకుంటున్నట్లు తెలిపారు. ఈ విషయంపై గ్రామ సమాఖ్య 1కు ఏపిఎం, సిసి విచారణకు హాజరైనప్పటికీ ఆదెమ్మ, వెంకటరమణ ఇద్దరూ హాజరు కాక పోగా సంఘంలో సమస్యలు సృష్టిస్తూ మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నట్లు వాపోయారు. వీఆర్ఏని విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు.

## పెరటాసి మాసం సందడే..సందడి..



నారాయణవనం, అక్టోబర్ 8 ప్రభాతవార్త : నారాయణవనం కల్యాణవెంకటేశ్వరుని ఆలయంలో పెరటాసి మాసం మూడవ శనివారం సందర్భంగా భక్తుల సందడి అధికమైంది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యవచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం పాలు, పెరుగు, నెయ్యి వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వామి, అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు.సాయంత్రం 6గంటల నుంచి గంటపాటు ఊంజలోసేవ నిర్వహించారు.ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితంఇన్స్పెక్టర్ భరత్, కైలాసం, అర్చకులు,విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటర్ ఐడీకి ఆధార్ అనుసంధానంపై ప్రత్యేక డ్రైవ్

సత్యవేడు,అక్టోబర్ 8 ప్రభాతవార్త : ఆధార్ కారుక్డు ఓటర్ ఐడీ అనుసంధానం ప్రక్రియపై ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు సత్యవేడు ఎన్నికల డీటి రవిచంద్రబాబు ఒక ప్రకటనలో శనివారం తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టంబర్ 21వ తేదీ నుండి ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ కొనసాగుతున్నట్లు గుర్తుచేశారు. ఇందులో భాగంగా మండలంలో 37464మంది ఓటర్లకు గానూ 21225మంది ఓటర్లు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవడం జరిగింది. మిగిలిన వారికి ఆధార్‌కు ఓటర్ఐడీ అనుసంధానంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్లు నమోదు ప్రక్రియ నవంబర్ 7వ చివరి గడువన్నారు. గతంలో ఓటుహక్కు కలిగిన పట్టభద్ర ఓటర్లు కూడా కొత్తగా వారి ఓటుహక్కును నమోదు చేసుకోవాలని ఈసందర్భంగా ఆయన తెలియజేశారు.

## ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ

సత్యవేడు,అక్టోబర్ 8 ప్రభాతవార్త : లారీ ఢీ కొన్న ఘటనలో ద్విచక్రవాహనదారుడు వెంకటేశన్‌కు తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా మండలపరిధిలోని చిన్నఈటిపాకం వద్ద సత్యవేడు మీదుగా వరదయ్యపాళెంకు వెళ్తున్న వెంకటేశన్ లోడింగ్‌తో వెళ్తున్న లారీ ఢీ కొనడంతో వెంకటేశన్‌కు కాలు విరిగిపోవడంతో పాటు, తీవ్రగాయాల య్యాయి. క్షతగాత్రుడు వెంకటేశన్‌ను ప్రాథమిక చికిత్స నిమిత్తం 108వాహనం ద్వారా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీని శ్రీసిటీ పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్షతగాత్రుడు వెంకటేశన్ తమిళనాడు, తిరువళ్ళూరు జిల్లా, గురవరాజుకండ్రిగ సిరుపులాల్ పేటకు చెందిన వాడుగా గుర్తించినట్లు తెలియజేశారు.

## స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి!

సత్యవేడు,అక్టోబర్ 8 ప్రభాతవార్త : చిన్నఈటిపాకం వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ద్విచక్రవాహనదారులు మృత్యువాత పడడం ఇదేమీ కొత్తవిషయం కాదని బిజెపి మండలాధ్యక్షుడు మునిక్రిష్ణయ్య అన్నారు. శనివారం చిన్నఈటిపాకం వద్ద చోటు చేసుకున్న రోడ్డుప్రమాదం నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ వరదయనయపాళెం రోడ్డు మార్గంలోని పాలగుంట మలుపు, చిన్నిఈటిపాకం బస్‌స్టాప్ వద్ద ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన వాహనదారులు కూడా ఉన్నారన్నారు. అయితే ఆర్అండ్‌బి అధికారులు మాత్రం వేగనిరోధకాలను ఏర్పాటుచేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఒకనైనా అధికారులు మొద్దునిద్ర వదిలి వేగనిరోధకాలను ఏర్పాటు చేయడంతో పాటు మలుపుల వద్ద ప్రమాదహెచ్చరికబోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.

## నకిలి పత్రాలతో బురిడి...పట్టించుకోని అధికారులు



శ్రీకాళహస్తి రూరల్,అక్టోబర్ 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం గుంటకింద పల్లి గ్రామంలో ఓ వికలాంగుని భూమిని బంధువులు నకిలీ పత్రాలు సృష్టించి ఇబ్బంది పెడుతున్నా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు జరిపి మొరబెట్టుకుంటున్నా పట్టించుకోవటం లేదని వాపోతున్నారు. ఈ మేరకు బాధితులు మునిరామిరెడ్డి తన ఆవేదనను పత్రికల వారికి విన్నవించుకున్నారు. ఎవరు తమను ఆదుకుంటారు? ఎవరు తన సమస్యను పరిష్కరిస్తారని? వాపోతున్నాడు. రాజకీయ పలుకుబడితో తనను ఇబ్బంది పెడుతున్నా అధికారులు కూడా ఏమి చేయలేని నిస్సహాయస్థితిలో ఉంటే తాను ఎవరికి చెప్పుకోవాలని వాపోతున్నాడు.వివరాలు బాధితుని కథనం మేరకు ఇలా ఉన్నాయి.మునిరామిరెడ్డికి గుంటకింద పల్లిలో రెండెకరాల సొంత భూమి ఉన్నట్లు వివరించారు. అయితే ఇందులో అర ఎకరా భూమి తన బంధువుల ఆక్రమించుకొని లీజు దారులను ఇబ్బంది పెడుతున్నారని వివరించారు.తనకు గల భూమిని ఎనిమిదేళ్ళ క్రితం భూమిని గుత్తకు ఇచ్చి వచ్చిన ఆదాయాలతో తన జీవనం గడుపుతున్నామని వివరించారు.తనకు అనారోగ్యంతో నడవ లేని స్థితిలో వికలాంగుడయ్యానని అత్తగారి సహకారంతో కొంత భూమిని తీసుకొని జీవనం గడుపుతున్నామన్నారు. తిరుపతిలో కాపురముంటూ జీవనం గడుపుకుంటున్నట్లు వివరించారు.ఇదే అదనుగా తమ బంధువులు కొదండరామిరెడ్డి తమకున్న పలుకుబడితో కబ్జా చేసి తమను వేదిస్తున్నారని తమ ఆవేదనను వివరించారు.ఈ సమస్యకు సంబంధించి పెద్దలతో పంచాయతీ జరిపినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. ఈ దురాగతానికి సంబంధించి తాను శ్రీకాళహస్తి రూరల్ పోలీసు స్టేషన్‌కు పది రోజులు తిరగినానని అయితే అధికారులు నిస్సహాయత వ్యక్తం చేస్తే ఇక ఎవరికి తన బాధ వివరించాలి? 'ఇక ఎవ్వరూ న్యాయం చేయక పోతే తన భార్య ఇద్దరు పిల్లలతో చావే గతి అని వాపోయాడు.జిల్లా అధికారులు స్పందించి న్యాయం చేయకుంటే తమ కుటుంబం ఆత్మహత్య చేసుకుంటామని దీనికి కారణం అధికారులే అని తన బాధను వివరించారు.

## ఔషధమొక్కల పెంపకంపై రైతులకు అవగాహన

శ్రీకాళహస్తి,అక్టోబర్ 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని బయోమార్క్ ఎక్స్పర్ట్ ప్రైవేటు లిమిటెడ్ సారథ్యంలో శనివారం రైతులకు ఔషధ మొక్కల పెంపకంపై అవగాహన సదస్సును నిర్వహించారు.మేనేజింగ్ డైరెక్టర్ ఎస్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యంగా తులసీ మొక్కల పెంపకానికి సంబంధించి రైతులకు చక్కగా వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తులసి మొక్కల్ని ఎవరైనా రైతులు వారి పొలంలో పెంచినట్లైతే వారి ఉత్పత్తులను కొనుగోలు చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదిగా గుమ్మడి దశరధాచ్చారి జయచంద్రనాయుడు, డాక్టర్ ఎన్ పున్నారావుఈ కార్యక్రమాల్లో 30 మంది రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థి అదృశ్యం



శ్రీకాళహస్తి,అక్టోబర్ 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి శుక్రవారం నుంచి కనబడటం లేదని తల్లిదండ్రులు పోలీసుకు ఫిర్యాదు చేసారు.టుటౌన్ సిఐ భాస్కర్‌నాయక్, ఎస్ఐ మహేష్‌బాబుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.శ్రీకాళహస్తి వివిఎంపల్లికి కె.సిద్దార్థ (16) శ్రీకాళహస్తిలోని ఎంజిఎం పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నారు.మెరున్ కలర్ ఫుల్ షర్టు,బ్లూకలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్న సిద్దార్థ శుక్రవారం ఇంటి నుంచి పాఠశాలకు అని బయలు దేరిన విద్యార్థి సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవటంతో పాఠశాలలో విచారించినట్లు వివరించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. విద్యార్థి ఎవరికైనా కనిపిస్తే వెంటనే టుటౌన్ సిఐ 9440900008కి తెలియజేయాలని కోరారు.

## జిల్లా ఎస్సీఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడుగా సురేష్



శ్రీకాళహస్తి, అక్టోబర్ 8 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా పట్టణంలోని వియం పల్లికి చెందిన పసలసురేష్ ఎంపిక య్యారు. శనివారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, వివక్షత, కేసులు పరిశీలన, నివారణపై ఈకమిటీ పనిచేస్తుంది. కమిటీకి ఛైర్మన్‌గా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారు. ఎంపి, ఎంఎల్ఏలు కూడా ఇందులో సభ్యులుగా ఉంటారు. అనంతరం పసలసురేష్ మాట్లాడుతూ దళిత ప్రజలు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలపై తన దగ్గర దృష్టికి వచ్చిన వెంటనే వారి సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తానని తెలిపారు. అనంతరం సురేష్‌ను పలువురుఅభినందించారు. కార్యక్రమంలో పసలరామచంద్రయ్య, పసలరమణయ్య, కయ్యూరు ఈశ్వరయ్య, పసలకమలాకర్, సిఆర్టీ ప్రసాద్, సాయి, లోకేష్, గంగయ్య, హరి, రమణ, కృష్ణమూర్తి, వేణు, యుగంధర్, నాగరాజు, శివ, తదితరులు పాల్గొన్నారు.

## జంతువుల లెక్క తేల్చే ప్రభుత్వం..బిసిల లెక్క తేల్చలేందా?



తిరుపతి ప్రెస్‌క్లబ్,అక్టోబర్ 8 ప్రభాతవార్త: అడవిలో తిరిగే క్రూరమృగాలైన పులులు,సింహాలను లెక్క కట్టి చెప్పే ప్రభుత్వాలకు సమాజంలోని బిసి కులాలను లెక్క కట్టి చెప్పడం అంత కష్టమా అని 'జాతీయ బిసి సంక్షేమ సంఘం' తిరుపతి జిల్లా అధ్యక్షుడు తురక అమరనాథ్ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీశారు.శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు ఆదివారం స్థానిక యూత్ హాస్టల్ నందు ఉదయం 10 గంటల నుండి నిర్వహించే హాలో బిసి-ఛలో తిరుపతి పేరుతో నిర్వహిస్తున్న తిరుపతి జిల్లా బిసిల ఆత్మీయ సమ్మేళన సమావేశానికి జిల్లాలోని బిసిలందరూ హాజరవ్వాలని కోరారు.ఈ సమావేశానికి జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హాజరవుతున్నారని తెలిపారు. బిసిల హక్కులు సాధించుకోవాలంటే నేడు జరిగే బిసిల ఆత్మీయ సమ్మేళన సమావేశానికి బిసిలందరూ పెద్ద ఎత్తున హాజరయ్యి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం నేతలు వై.జగన్నాథం, ఎం.రాజాబాబు, రెడ్డెన్న,మునిచంద్ర,శివకుమార్ పాల్గొన్నారు.

## పట్టభద్రులుగా ఓట్లు నమోదు చేసుకోండి!

తిరుపతి ప్రెస్‌క్లబ్,అక్టోబర్ 8 ప్రభాతవార్త: త్వరలో జరిగే పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో ఓటర్లుగా 2019కి ముందు డిగ్రీ పూర్తి చేసిన వారు నవంబర్ 7 లోపు ఓట్లు నమోదు చేసుకోవాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్ గౌడ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ మేరకు శనివారం తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కె.రామ్మోహన్,టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్కే.నాయుడులతో కలిసి ఎస్వీ.యూనివర్సిటీలోని పలు హాస్టళ్ల వద్దకెళ్లి పట్టభద్రులైన అర్హులను కలిసి ఓటర్ల జాబితాలో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.అలాగే టిడిపి తూర్పు రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో తెలుగు యువత,టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ ట్రస్ట్, ఎస్వీఐసిసిఏఆర్‌చే ఉచిత వైద్య శిబిరం



చంద్రగిరి, అక్టోబర్ 8 ప్రభాతవార్త: రాజకీయంగా యువతలో చైతన్యం నింపుతూ తన సొంతురు ముంగిలిపట్టులో తెలుగుయువత చంద్రగిరి నియోజకవర్గ అధ్యక్షుడు యశ్వంత్ చౌదరి ఏర్పాటు చేయించిన సామాజిక సేవకు సర్వత్రా అభినందనలు లభించాయి. టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని సహకారంతో ముంగిలిపట్టులో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు యశ్వంత్ చౌదరి ప్రత్యేక చొరవతో 50 మంది రక్తదానం చేయడంతో యువతలోని సేవాభావం పట్ల గ్రామస్థులు అభినందించారు. అదే విధంగా శ్రీ వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అడ్వాన్స్ రీసెర్చ్ (ఎస్వీఐసిసిఏఆర్), ఎన్‌టిఆర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉచిత వైద్యశిబిరంలో 400 మంది హాజరై వివిధ రకాల పరీక్షలు చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో కోవి దివాకర్ చౌదరి సహకారంతో రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేయించారు.

## తిమ్మప్ప దేవాలయ పునర్నిర్మాణ పూజ



చంద్రగిరి, అక్టోబర్ 8 ప్రభాతవార్త: తొండవాడ వద్ద గల పురాతన తిమ్మప్ప దేవాలయం వద్ద ఆలయ పునర్నిర్మాణ సమితి అధ్యక్షుడు తపసి మురళి రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సాయి చందన దంపతులు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరిత్రాత్మక పురాతన కట్టడమైన తిమ్మప్ప దేవాలయాన్ని నిర్మించే అవకాశం లభించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఎంతో విశిష్టత కలిగిన తిమ్మప్ప దేవాలయ పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఆలయ విశిష్టతపై తెలుగు, తమిళ, కన్నడ, ఆంగ్ల భాషలలో పుస్తక ఆవిష్కరణ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తొండవాడ మాజీ సర్పంచ్ తపసి సత్యనారాయణ రెడ్డి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

రేణిగుంట, అక్టోబరు 8 ప్రభాతవార్త: రేణిగుంట-శ్రీకాళహస్తి జాతీయ రహదారిపై మండలంలోని మల్ల వరం వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెల్లమ్మ(53) అక్కడికక్కడే మృతి చెందింది. రేణిగుంట అర్బన్ పోలీస్‌స్టేషన్ రైటర్ వెంకటరమణ కథనం మేరకు... ఏర్పేడు మండలం అంజిమేడుకు చెందిన సుబ్రహ్మణ్యం, తన భార్య వెల్లమ్మతో ద్విచక్రవాహనంపై రేణిగుంట వైపు నుంచి అంజిమేడుకు వెళుతున్నాడు. ఇతను వెళుతున్న వాహనం మల్లవరం చేరుకునే సరికి వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్రహ్మణ్యం, భార్యతో సహా కిందపడిపోయారు. లారీ టైరు భార్య తలపై ఎక్కడంతో తల నుజ్జు అయి అక్కడికక్కడే మృతి చెందింది. సుబ్రహ్మణ్యం స్వల్పంగా గాయపడ్డాడు. సీఐ సుబ్బారెడ్డి ఆదేశాలు మేరకు పోలీసులు సంఘటనా స్థలం చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## యువతపై దేశ భవిష్యత్ ఆధారపడి ఉంది



రేణిగుంట, అక్టోబరు 8 ప్రభాతవార్త: దేశ భవిష్యత్ యువకులపై ఆధారపడి ఉందని రాస్ ప్రాజెక్టు మేనేజర్ జయచంద్రనాయుడు అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ రాస్ కార్యాలయ ంలో రాష్ట్రీయ సేవా సమితి ఆధ్వర్యాన చైల్డ్ ఫండ్ ఆర్థిక సహాయంతో శనివారం యువజన సంఘం సభ్యులకు అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో పాల్గొన్న యువతకు అనేక అంశాలపై అవగాహన కల్పించారు. సమాజంలో సమస్యలను గుర్తించి వాటిని ఎలా పరిష్కరించాలో జయచంద్రనాయుడు యువకులకు వివరించారు. ముఖ్యంగా యువకులు సమూహాలుగా ఏర్పడి సంఘ సేవలో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. సదస్సులో రాస్ సమన్వయకర్త నాగేంద్ర, యువజన సంఘం సభ్యులు, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మీ సహకారం మాకు అవసరం :సర్పంచ్ నాగేషం

రేణిగుంట, అక్టోబరు 8 ప్రభాతవార్త: రేణిగుంట పంచాయతీ అభివృద్ధికి మీ సహకారం అవసరమని రేణిగుంట మేజర్ పంచాయతీ సర్పంచ్ నాగేషం రెవెన్యూ సీజీఎం ధర్మ జ్ఞానిక విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ సీజీఎంగా పదోన్నతి పొందిన ధర్మజ్ఞానిని రేణిగుంట సర్పంచ్ నాగేషం మర్యాదపూర్వకంగా కలసి పూలబొకే ఇచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ధర్మజ్ఞాని పదోన్నతి పొందడం ఆనందంగా ఉందన్నారు. మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. రేణిగుంట పంచాయతీ అభివృద్ధిలో తమకు సహాయం చేయాలని ఆయన కోరారు. సర్పంచ్‌తో పాటు వార్డు మెంబర్లు ఉన్నారు.

## డిజి మీడియా పోస్టర్ ఆవిష్కరణ



తిరుపతి క్రైం, అక్టోబర్ 8, ప్రభాతవార్త : తిరుపతి తిరుమల ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిజి మీడియా పోస్టర్లు ఆవిష్కరించారు. శనివారం స్థానిక బాబు జగజీవన్ రావ్ భవన్‌లో తిరుపతి ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ రాజు ఆధ్వర్యంలోకార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిధిగా తమిళనాడు రాష్ట్రం ఫోటో గ్రాఫర్స్ ఉపాధ్యక్షుడు శరవణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడులో అక్టోబర్ 14 నుండి 16 వరకు ఫోటో గ్రఫీ ఎక్స్పో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి నుంచి ఫోటో గ్రాపర్స్ అందరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. శంకర్, పురందర్ సుబ్రమణ్యం, సతీష్, శరత్, దినేష్, మురళి, సురేష్ పాల్గొన్నారు.

## పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోండి



శ్రీకాళహస్తి, అక్టోబర్ 8 ప్రభాతవార్త : పట్టభద్రులు తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని 32వ వార్డు ఇన్‌ఛార్జి, పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు పోలూరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం 32వ వార్డులో ఉన్న పట్టభద్రులను కలసి ఓటుహక్కు నమోదు పత్రాలు అందించారు. ఈసందర్భంగా పోలూరు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి 2023లో జరిగే తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి అభ్యరథి (ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలు)గా తెలుగుదేశంపార్టీ తరపున డాక్టర్ కంచర్ల శ్రీకాంత్‌ను గెలిపించాలని కోరారు. ఓటు నమోదు చేసుకునే పట్టభద్రులు 2019 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అక్టోబర్ 1వ తేదీ నుంచి నవంబర్ 7వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చున్నారు. కార్యక్రమంలో 32వ వార్డు ఇన్‌ఛార్జి, పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు పోలూరు శ్రీనివాసులురెడ్డి, మధురెడ్డి, వార్డు అధ్యక్షుడు రుకేష్‌రాయల్, కార్యదర్శి ఎస్‌కె.షఫి, ఉపాధ్యక్షులు మణి, పార్ధు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతిగా ఎన్నికైన ద్రౌపది ముర్ము విజయోత్సవాలు



కేవీబీ పురం, అక్టోబరు 8 ప్రభాతవార్త: భారత నూతన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎన్నికైన సందర్భంగా కేవీబీ పురం మండల అధ్యక్షుడు మునిశేఖర్, బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు కేవీబీ పురం మండల ఇన్‌చార్జి చంద్రప్ప ఆధ్వర్యంలో కేవీబీ పురం మండలంలోని కోవనూరు ఎస్టీ కాలనీలో గిరిజన ప్రజలతో కలసి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రప్ప మాట్లాడుతూ ఒక సామాన్య నేపథ్యం నుంచి మొదలు పెట్టి ఉపాధ్యాయురాలుగా కౌన్సిలర్‌గా, ఎమ్మెల్యేగా, గవర్నర్‌గా అనేక బాధ్యతలు నిర్వర్తించి నేడు రాష్ట్రపతి స్థాయి వరకు ఎదిగిన ముర్ము గారి జీవిత ప్రయాణాన్ని గిరిజన ప్రజలకు వివరించడం జరిగింది. స్ఫూర్తివంతమైన వారి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరడం జరిగింది. అనంతరం స్థానిక కాలనీకి చెందిన చెరివి జనార్దన్‌కి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య, మండల ప్రధాన కార్యదర్శి వెంకటకృష్ణయ్య, సుబ్రహ్మణ్యం, మండల ఉపాధ్యక్షులు మునిరాజ, కోవనూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ పాలిటెక్నిక్ అడ్మిషన్లు

పుత్తూరురూరల్, అక్టోబరు 8 ప్రభాతవార్త: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయానికి అనుబంధంగా పుత్తూరులోని ఎస్‌వీఎస్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా ఈ నెల 13వ తేదీ అడ్మిషన్లు జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 విద్యా సంవత్సర ప్రవేశాల కోసం తమ కళాశాలలో వ్యవసాయ డిప్లమాలో చేరడానికి 10వ తరగతి పాస్, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 8498077775, 6300272844 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## జడివానలోను... గడప గడపకు మోహిత్‌రెడ్డి



తిరుపతిరూరల్, అక్టోబర్ 8 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి జడివానను సైతం లెక్క చేయకుండా గడప గడపకు పాదయాత్ర కార్యక్రమాన్ని కొనసాగించారు. శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు తిరుమల నగర్‌లో గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోహిత్ రెడ్డి ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుపై ఆరా తీసారు. ప్రజల యోగక్షేమాలు వివరాలు తెలుసుకున్నారు. లివర్ వ్యాధి బాధపడుతున్న వ్యక్తి మెరుగైన వైద్యం అందించాలని స్విమ్స్ డాక్టర్లను కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రంగస్థల నటుడు ఆనందరావు మృతి తీరనిలోటు



తిరుపతి,అక్టోబర్ 8ప్రభాతవార్త: రంగస్థలనటుడు కొత్తపల్లి ఆనందరావు మృతి కళారంగానికి తీరనిలోటని రాయలసీమ రంగస్థలికళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అకాలమరణం కళారంగంలో కళాకారులను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఆయన చిత్రపటానికి కళాకారులు కెఎన్ రాజ, రామచంద్రారెడ్డి, దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, కెసి కృష్ణ, చంగారెడ్డి, పొన్నాల జేజిరెడ్డి, రవిచంద్ర తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

## సర్పంచ్‌ల అరెస్టులు దారుణం :సింగంశెట్టి

తిరుపతి,అక్టోబర్ 8ప్రభాతవార్త: రాష్ట్రపంచాయతీరాజ్‌ఛాంబర్ తరపున సర్పంచ్‌లు తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించమని కమిషనర్‌కు వినతిపత్రం అందించడానికి వెళితే సర్పంచ్‌లను అరెస్టుచేయడం దారుణమని రాష్ట్రపంచాయతిరాజ్‌ఛాంబర్ ఉపాధ్యక్షుడు సింగంశెట్టిసుబ్బరామయ్య ఖండించారు. సర్పంచ్‌ల బాధలు,గ్రామీణ ప్రజలు సమస్యలు రాష్ట్రప్రభుత్వానికి పట్టవా అని ప్రశ్నించారు. సర్పంచ్‌లు రాజకీయాలకతీతంగా గ్రామాల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నారని, నెలకు 15వేల రూపాయలు వేతనం ఇవ్వాలని, గ్రామ సచివాలయాలు, వాలంటీర్లను సర్పంచ్ పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు

## ఘనంగా ముగిసిన శ్రీ సంతాన సంపద వెంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు..



తిరుపతి ప్రెస్‌క్లబ్,అక్టోబర్ 8 ప్రభాతవార్త: రేణిగుంట సమీపంలోని వికృతమాల గ్రామంలో వెలసిన శ్రీ సంతాన సంపద వెంకటేశ్వరస్వామి ఆలయంలో 3 రోజులు పాటు నిర్వహించిన పవిత్రోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి.కార్యక్రమంలో భాగంగా ఉదయం8 గంటలకు భగవత్ ప్రార్థన,శ్రీ విష్వక్సే నారాధన,పుణ్యాహవచనం, అగ్నిప్రణయము.ప్రధాన కుంభారాధనము, తదుక్తహవనము, 'ఉత్సవబింబ స్నపనము' నిర్వహించారు.అలాగే సాయంత్రం 6 గంటల నుండి శ్రీ విష్వక్సే నారాదనము, పుణ్యాహవచనము, ప్రధాన కుంభారాధనము, అగ్నిధ్యానము, తదుక్తహవనము, మహాపూర్ణాహుతి, పవిత్రవిసర్జనము, బ్రహ్మఘోష, యాజమాన మహదాశీర్వచనం,పవిత్ర వితరణము,తీర్థప్రసాద వితరణములను అర్చకులు శ్రీ బాలాజి రంగాచార్యులు చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త డా॥పసుపులేటి హరిప్రసాద్ మరియు ఆయన కుటుంబ సభ్యులు,ఆలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఎంఎల్ఏ



తొట్టంబేడు, అక్టోబర్ 8 ప్రభాతవార్త : గత పాలకుల పరిపాలనలో పిల్లమేడు ఎస్‌టిను పట్టించుకోకుండా ఉన్నారని 30ఏళ్ళుగా ఇంటి పట్టాలు పొందని 30మంది నిరుపేద ఎస్‌టి కుటుంబాలకు ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి పట్టాలు అందించి ఇచ్చిన మాట నిలుపుకున్న నేతగా వారి మదిలో చిరస్థాయిగా స్థానం సొంతం చేసుకున్నారు. ప్రభుత్వాలు మారినా ఎస్‌టిల జీవితంలో వెలుగులు నింపలేదని వచ్చిన అధికారంలోకి వచ్చిన తాము ఇచ్చిన మాట ప్రకారంఏళ్ళ తరబడి పట్టాల సమస్యను పరిష్కరించామన్నారు. అలాగే హౌసింగ్ పథకంలో ఇండ్లు కూడా నిర్మించి ఇచ్చేందుకు అన్ని చర్యలుతీసుకుం టామన్నారు. వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాతే నిరుపేదల జీవితాల్లో సొంత ఇంటికల నెరవేరుతోందని జగనన్న కాలనీలు అన్ని మౌళిక సదుపాయాలతో నిర్మించనున్నారని ఎంఎల్ఏ తెలిపారు. అనంతరం ఎస్టీ కాలనీ వాసులు మాట్లాడుతూ దశాబ్దాల కాలం నాటి సమస్యను పరిష్కరించిన ఎంఎల్ఏకు తాము రుణపడి ఉంటామన్నారు. అనంతరం పటాలు అందించడంతో ఎస్టీకాలనీ వాసుల్లో చిరునవ్వులు విరిసాయి. అనంతరం ఎంఎల్ఏను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మణి, భాస్కర్, మండల వైకాపా నాయకులు ఉన్నంవాసుదేవనాయుడు, మాజీ సర్పంచ్ మునిరత్నం, ఎంపిటిసి గురుమూర్తి, కొన్నలిరమేష్, శివానందం, మురళీ, గురవయ్య, యుగంధర్, సుబ్రమణ్యం, రమణ, జగదీష్, డిల్లీబాబు, వెంకటేష్, తహశీల్దార్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సాధికార సమితి సభ్యులు నియామకం



శ్రీకాళహస్తి, అక్టోబర్ 8 ప్రభాతవార్త : తెలుగుదేశంపార్టీ రాష్ట్ర బిసి సాధికార సమితి సభ్యులుగా మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్, పట్టణ ప్రధాన కార్యదర్శి మిన్నల్‌రవి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర గాండ్ల సాధికార కమిటీ సభ్యుడుగా కన్నావరం హరిబాబులను నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఈసందర్భంగా పార్టీ కార్యాక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న వీరికి రాష్ట్ర పదవి లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈసందర్భంగా మిన్నల్‌రవి, కన్నావరం హరిబాబులు మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, జాతీయ కార్యదర్శి నారాలోకేష్, రాష్ట్ర అధ్యక్షులు అచ్చెమనాయుడు, రాష్ట్ర బిసి సెల్ అధ్యక్షులు మరియు రాష్ట్ర సాధికార సమితి కొల్లు రవీంద్ర, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, బొజ్జలబృందమ్మ, తిరుపతి పార్లమెంటు నాయకులు నరసింహయాదవ్ మరియు రాష్ట్ర నాయకులకు, నియోజకవర్గ నాయకులకు మండల అధ్యక్షులకు ధన్యవాదాలు తెలిపారు. మిన్నల్‌రవిని, హరిబాబులను పలువురు అభినందించారు.

## శ్రీకాళహస్తి అసెంబ్లీ టిక్కెట్టు బిసిలకు కేటాయించాలి



శ్రీకాళహస్తి, అక్టోబర్ 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి అసెంబ్లీ టిక్కెట్టును బిసిలకు కేటాయించాలని రాష్ట్ర బిసి చైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు వీరపల్లి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. అగ్రవర్ణపార్టీలు బిసిలకు టిక్కెట్టు కేటాయించని పక్షంలో బిసి చైతన్యవేదిక తరపున తామే అభ్యర్థిని నిర్ణయించి అత్యధిక మెజారిటీతో గెలిపించుకుని బిసిల ఐక్యత చాటుతామన్నారు. తిరుపతి బాలాజీ జిల్లాలో ప్రతి నియోజకవర్గంలోను అత్యధికంగా బిసిలు ఉన్నారని వీరందరినీ రాజకీయంగా చైతన్య పరచి రాజ్యాధికారంలోను తమ వాటాకోసం పోరాటం చేస్తామని ప్రకటించారు. బిసిల ఐక్యతతోనే రాజ్యాధి కారం సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు కోట.చంద్రశేఖర్, భాస్కర్‌గౌడ్, చిన్నఅంకయ్య, సుగ్రీవ, కన్నెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు లేని సమాజం వైపుకు తీసుకెళతా : మంత్రి పెద్దిరెడ్డి



చౌడేపల్లి, అక్టోబర్ 8 ప్రభాతవార్త : ప్రజలను వ్యక్తిగత, సామాజిక సమస్యలు లేని సమాజం వైపుకు తీసుకెళతానని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మంత్రి పెద్దిరెడ్డి మండలంలో పర్యటించారు. స్థానిక మండల పరిపాలనా భవనంలో షికారిపాళెం 57మంది ఎస్టీలకు వంద ఎకరాల వ్యవసాయభూమి, పట్టణంలోని సంతగేటు వద్ద దేవాదాయస్థలంలో ఆవాసాలు ఏర్పాటు చేసుకొన్న 35మంది నిర్వాసితులకు పత్రాలందించారు. అనంతరం పరికిదొన, గడ్డంవారిపల్లి తదితర ప్రాంతాల్లో నూతనంగా నిర్మితమైన ఆర్‌బికే, సచివాలయాల భవనాలను ప్రజలకు అంకితం చేసారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంతోపాటు ఇవ్వని వాటిని సైతం అమలు చేసి దేశంలోనే విలక్షణ ముఖ్యమంత్రిగా ఖ్యాతి గడించారన్నారు. నవరత్నాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారనీ, కష్టకాలంలోనూ ఇచ్చిన హామీలకు కట్టుబడి పాలన కొనసాగిస్తున్నా మన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా భావించి, పారదర్శక పాలన అందిస్తున్నా మనీ, సచివాలయ వ్యవస్థను దేశస్థాయి, ఆర్‌బికే వ్యవస్థ ప్రపంచస్థాయిలో గుర్తింపు వస్తుందంటే వాటి వల్ల ప్రజలకు ఎంత మేలు జరుగుతుందో తెలుస్తోందన్నారు. అందరి మన్నలను పొందుతున్న వైకాపా ప్రభుత్వం రాబోయే కాలంలోనూ అభివృద్ధిలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మరలా ముఖ్య మంత్రిగా ప్రజలు ఎన్నుకొంటారన్నారు. వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, దృశ్యకళలు రాష్ట్ర అకాడమీ సభ్యుడు కూరపర్తి అంజిబాబు, యువకాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు మిద్దింటి కిషోర్, జడ్పిటీసీ ఎన్.దామోధర్‌రాజు, ఎంపిపి జి.రామ్మూర్తి, ఉపాధ్యక్షులు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపిలు రుక్మిణమ్మ, రెడ్డిప్రకాష్, సింగిల్‌విండో ఛేర్మన్ రవిచంద్రారెడ్డి, సర్పంచు శ్రీరామ్‌భరత్‌వరుణ్, హెచ్‌డిఎస్ ఛేర్మన్ కళ్యాణ్‌భరత్, తహశీల్దార్ మాధవరాజు, ఎంపిడిఓ సుధాకర్, ఆయా పంచాయతీలకు చెందిన సర్పంచులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు, అన్ని వాఖలకు చెందిన అధికారులు పాల్గన్నారు.

## కౌన్సిల్‌లో చర్చించే అంశాలపై సమీక్ష : మేయర్ డా. శిరీషా



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 8 ప్రభాతవార్త : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో చర్చించే అంశాలపై తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డా. శిరీషా, కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి ముఖ్య అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో మేయర్ డా. శిరీషా, డిప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డిలు మాట్లాడుతూ గత కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు ప్రజా సమస్యలపై తెలిపిన అంశాలపై ఎంత వరకు పరిష్కరించడం జరిగిందని ప్రశ్నించారు. పెండింగ్‌లో వున్న పనుల ఆలస్యంపై వివరణ అడిగి తెలుసుకోవడం జరిగింది. అదే విధంగా జరగనున్న కౌన్సిల్ సమావేశంలో చర్చించే అంశాలపై సమీక్ష నిర్వహించడం జరిగింది. తిరుపతి ఖ్యాతిని దేశంలో ముందుంచే కార్యక్రమాలను నిర్వహించాలని, తిరుపతి ప్రజలకు సౌకర్యాలను కల్పిస్తూ తిరుమలకి వచ్చే యాత్రికులను దృష్టిలో ఉయంచుకుని తిరుపతి నగరాభివృద్ధికి కార్యక్రమాలను చేపట్టాలని స్పష్టం చేసారు. అనంతరం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ గత కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు సూచించిన అభివృద్ధి పనులను వీలైనంత వరకు పనులు చేయడం జరిగిందని, పెద్ద పనులను మరోమారు కౌన్సిల్ దృష్టికి తీసుకురావడం జరుగుతుందన్నారు. ప్రజలకి అవసరమైన రోడ్లు, కాలువలు, నీటి సౌకర్యాలపై జరగనున్న కౌన్సిల్ సమావేశానికి తీసుకువస్తున్నట్లు వివరించారు. జరిగిన పనులను, చేపట్టబోవు పనుల వివరాలను కమిషనర్ అనుపమ అంజలి సమిక్ష సమావేశంలో తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు సేతుమాదవ్, లోకేష్‌వర్మ, సెక్రటరీ రాధికారెడ్డి, హెల్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, ఏసిపిలు షణ్ముగం, బాలసుబ్రమణ్యం, మేనేజర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పుష్ప పల్లకిపై ఉగ్రప్రత్యంగిరాదేవత



చంద్రగిరి, అక్టోబర్ 8 ప్రభాతవార్త: తొండవాడ గ్రామ పంచాయతీ పరిధిలో వెలసియున్న శ్రీ ఉగ్రప్రత్యంగిరాదేవతా పీఠంలో దేవీ నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారు శనివారం పుష్ప పల్లకిపై ఉగ్రప్రత్యంగిరాదేవత (గ్రామోత్సవం) భక్తులకు దర్శన మిచ్చారు. ఇందులో భాగంగా పీఠాధిపతి సూరి స్వామి ఉదయం 6 గంటల నుండి 7.30 గంటల వరకు అమ్మవారికి అభిషేకం, విశేష అలంకరణ గావించారు. రాత్రి అమ్మవారిని వివిధ రకాల సుగంధభరిత పుష్పాలతో విశేష అలంకరణ గావించారు. పీఠాధిపతి సూరి స్వామి ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారనల నడుమ అమ్మవారిని పుష్పపల్లకిపై అధిష్టింపజేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బ్యాండు బాజాలు, సాంస్కృతిక, జానపద కళాకారుల భజనలతో గ్రామోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి మంగళ హారతులిచ్చి, కర్పూరనీరాజనాలర్పించారు. వాహనసేవ దాతలకు సూరి స్వామి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## పిల్లలతో సహా తల్లి అదృశ్యం-కేసు నమోదు



తొట్టంబేడు, అక్టోబర్ 8 ప్రభాతవార్త : మండలంలోని బీడికాలనీలో నివాసం ఉంటున్న వెంకటరత్న(28) తన ఇద్దరు బిడ్డలతో పాటు ఇంటి నుంచి వెళ్ళిపోయినట్లు తొట్టం బేడు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బీడి కాలనీలో నివాసం ఉంటున్న వెంకటరత్న భర్త బత్తెయ్య మేస్త్రీ పనిచేసుకుని జీవనం సాగిస్తున్నాడు. వీరికి కుమారుడు సంజయ్(8), కుమార్తె జెస్సికా(6)లు ఉన్నారు. మంగళవారం ఇద్దరు చిన్నారులను తీసుకుని వెంకటరత్న ఇంటి నుంచి వెళ్ళిపోయింది. దీంతో బత్తెయ్య బంధువుల ఇండ్లలోను, వివిధ ప్రాంతాల్లోను గాలించినా కనిపించకపో వడంతో శనివారం తొట్టంబేడు పోలీసులకు పిర్యాదుచేశాడు. ఈమేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు.

## సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయండి..ఎంఎల్ఏ



తొట్టంబేడు, అక్టోబర్ 8 ప్రభాతవార్త అర్హులందరికీ జగనన్న సంక్షేమ పథకాలు అందాలని ఎంఎల్ఏ బియ్యపు మధు సూధన్‌రెడ్డి అధికారులను, వాలంటీర్లను ఆదేశించారు. గడపగడపకు మన ప్రభుత్వ ంలో భాగంగా తొట్టంబేడు మండలంలోని రౌతుసూరమాల సచివాలయ పరిధిలో ఉన్న లింగమ నాయుడుపల్లి, లింగమ నాయుడుపల్లి హరిజనవాడ, దొమ్మరమిట్ట, రామానాయుడు ఎస్టి కాలనీ, క్రైస్తవమిట్ట, గుమ్మిడిగుంట, కురవకనేరి, యానాది సెంటర్‌లో గడపగడపకు ఆయన పర్యటించారు. ఈసందర్భంగా గ్రామాల్లో ఎంఎల్ఏకు స్థానిక నాయకులు భారీ పూలమాలతో క్రేన్ ద్వారా అలంకరించి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎంఎల్ఏ ఇంటింటికి తిరుగుతూ అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా?లేదా? అని ఆరాతీశారు. దుష్టచతుష్టయం ఎన్ని ఆరోపణలు చేసినా 2024లో జగనన్నకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మూడేళ్ళలో జగనన్న ప్రజలకు అందించి సంక్షేమ పథకాల గురించి ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ సాగిన కార్యక్రమంలో అర్హత ఉన్న వారందరికీ త్వరలోనే ప్రభుత్వ పథకాలు అందించాలని వాలంటీర్లను ఆదేశించారు. అర్హులైన వారికి పథకాలు అందించడంలో వివక్షత చూపితే సహించేది లేదని వాలంటీర్లను, అధికారులను ఎంఎల్ఏ హెచ్చరించారు. ప్రస్తుతం సీజనల్ జ్వరాలు వస్తున్నాయని అందరు జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సర్పంచ్ ఘట్టమనేని వెంకటేశ్వరనాయుడు, శీను, మనోజ్, శ్రీను, మురళీ, రమేష్, ఆనంద్, రాజేంద్ర, వెంకటరామా నాయుడు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## పెరటాసి మూడవ శనివారం: వరదరాజస్వామి ఆలయం కిట కిట



శ్రీకాళహస్తి,అక్టోబర్ 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణంలోని నడిబొడ్డులో వెలసిన ప్రసన్న వరదరాజ స్వామి ఆలయం పెరటాసి నెల మూడ డవ శనివారం భక్తులతో కిట కిట లాడింది.ఇక్కడ వెలసిన ఏకైక వైష్ణవాలయం ప్రసన్న వరదరాజ స్వామి ఆలయం. ఇక్కడకు ప్రతి నిత్యం వేలాది మంది భక్తులు దర్శించుకుంటారు. ఈ నేపధ్యంలో శనివారం ఉదయం నుంచి ఆలయంలో భక్తులతో కిట కిట లాడింది. శనివారం ఉదయం నుంచి ఆలయంలో భక్తులు కిట కిట లాడింది. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు శ్రీనివా సులు హాజరై సేవల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి స్వామి వారికి షోడషాభిషేకాలు నిర్వహించారు. ధర్మకర్తల మండలి చైర్మెన్ భక్తుల సదుపాయాల్ని పర్యవేక్షించారు. ప్రసాదాలను వితరణ చేసారు.

## ముదిరాజ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఉమాపతిరావ్



వడమాలపేట, అక్టోబరు 8 ప్రభాతవార్త: చిత్తూరు పార్లమెంట్ టీడీపీ బీసీ సాధికార ముదిరాజ్ సంఘం కమిటీ కన్వీనర్‌గా డాక్టర్ వడమాల ఉమాపతిరావ్‌ను నియమించినట్లు నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ శనివారం ప్రకటించారు. వడమాలపేట మండలం, కాయంపేట గ్రామానికి చెందిన డా. ఉమాపతిరావ్‌ను కన్వీనర్‌గా నియమిస్తూ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు పంపించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉమాపతిరావ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇప్పించిన భానుప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో టీడీపీకి పూర్వ వైభవం తీసుకురావడానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని త్వరలో ముదిరాజ్ సామాజిక వర్గం సమావేశాన్ని నిర్వహిస్తానని తెలిపారు.

## 134 గ్రామాల భూహక్కు పత్రాలు సిద్ధం

**- జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్**



చిత్తూరు, అక్టోబర్ 8 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూముల రీ-సర్వే కార్యక్రమంకు సంబంధించి 134 గ్రామాలకు సంబం ధించి భూహక్కు పత్రాలు సిద్ధం అయ్యాయని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. భూముల రీ-సర్వే కార్యక్రమంపై శనివారం జెసి వెంకటేశ్వర్ ఆర్డీఓలు, తహసిల్దార్లు, సర్వేయర్లతో వీడియో కాన్ఫ రెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జెసి మాట్లాడుతూ వ్యాలిడేషన్ కార్యక్రమం పెండింగ్‌లో వున్న ప్రాంతాల్లో వేగవంతం చేయాలని ఆ గ్రామాలకు సంబంధించి 13 నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. రేపటిలోపు నిర్దేశించిన గ్రామాలకు సంబంధించి వ్యాలిడేషన్ పూర్తి చేసి నోటిఫికేషన్ విడుదల చేసి కలెక్టరేట్‌కు పంపాలన్నారు. అలాగే వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఇందుకు సంబంధించి సిసిఎల్ఎ కార్యదర్శి ఇచ్చిన ఐదు పారామీటర్ల మేరకు పక్కాగా పూర్తి చేయాలన్నారు. అలాగే ఎలాంటి లోపం లేకుండా భూహక్కు పత్రాలు ప్రింట్ అయి వచ్చేలా చూడాలన్నారు. అలాగే సర్వే రాళ్ళ నాటడానికి అన్ని ఏర్పాట్లు పక్కాగా చేపట్టి పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం నుండి అనుమతి ఇచ్చిన వెంటనే సర్వే రాళ్ళు నాటే కార్యక్రమం చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ డిటి శివకుమార్, డిఐలు గణేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం నిండా భక్తజనం -దర్శనానికి నాలుగు గంటల పైమాటే



కాణిపాకం, అక్టోబర్ 8 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అలయం శనివారం భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగిపోయింది. ఆలయం లో సాధారణంగా వారాంతపు రోజుల్లో తీవ్ర స్థాయి లో భక్తుల రద్దీ వుంటుంది. ఈమేరకు శనివారం అంచనాలకు మించి ఆలయ దర్శనార్థం వివిధ ప్రాంతాలనుండి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి కూడా భక్తులు స్వామివారికి మొక్కు బడులు తీర్చుకునేందుకు కాణిపాకం ఆలయానికి పెద్దఎత్తున తరలివచ్చారు. కాణిపాకం దేవస్థానంలో ప్రధాన ఆలయం కుంభాభిషేకం పూర్తయి స్వామివారి మూలవిరాట్ దర్శనం కల్పిస్తుండడంతో పాటు పెరటాసి నెల మూడవ శనివారం కావడంతో భక్తులు అనూహ్యంగా తరలివచ్చారు. దీనితో ఉదయం నుండి రాత్రి వరకు భక్తజన సందోహంతో కాణిపాకం ఆలయం కిక్కిరిసింది. ఆలయంలోపుల క్యూలైన్లు, సర్వదర్శనం కంపార్ట్‌మెంట్ పూర్తిగా నిండిపోవడంతో బయట క్యూలైన్లలో వేచివుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. రద్దీ కారణంగా స్వామి దర్శనంకోసం సుమారు మూడు నుండి నాలుగు గంటల పాటు క్యూలైన్లలో భక్తులు వేచివుండాల్సిన పరిస్థితి నెలకొంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

## బావిలో పడి ఎలుగుబంటి మృతి



కుప్పంరూరల్, అక్టోబర్ 8 ప్రభాతవార్త : పురాతన బావిలో పడి ఓ ఎలుగుబంటి మృతి చెందిన సంఘ టన ఆలస్యంగా వెలుగు చూసింది. మండలంలోని సజ్జల పల్లి గ్రామం వద్ద ముప్పై అడుగుల లోతులో ఉన్న పురాతన బావిలో సుమారు పది రోజుల క్రితం ఎలుగుబంటి పడి మృతి చెందిందని ఎఫ్ఆర్వో మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. బావి చుట్టూ దుర్వా సన రావడంతో స్థానికులు సమాచారం అందించార న్నారు. అనంతరం బావిని పరిశీలించగా ఎలుగు బంటి మృతి చెంది శరీరం మొత్తం వేరుపడిపోయి ఉండడాన్ని గుర్తించామన్నారు. ఎలుగుబంటికి పంచ నామా సైతం నిర్వహించలేని స్థితిలో మృతదేహం కుళ్లిపోయి ఉందన్నారు.అదే బావిలో మృతదేహంను కాల్చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్వో కృష్ణప్రసాద్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

## కన్నుల పండువగా టిటిడిచే శ్రీవారి కళ్యాణోత్సవం



కుప్పం, అక్టోబర్ 8 ప్రభాతవార్త : కలియుగ దైవం శ్రీ శ్రీనివాసస్వామి కళ్యాణోత్సవంను కన్నుల పండువగా శనివారం మండలంలోని బేటరాయ స్వామి ఆలయం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) అధ్వర్య ంలో నిర్వహించారు. స్వామి,అమ్మవార్ల కళ్యాణోత్సవంను తిలకించేందుకు భక్తులువేల సంఖ్యలో ఎ ౕ శ జ ం ౕ య ౕ ్యా య ం ౕ ు. కళ్యాణోత్సవంసందర్భంగా టిటిడి అర్చకులు తిరుమల నుంచి తీసుకు వచ్చిన స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి కన్నులు మిరమిట్లు గొలిపేలా అలంకరించారు. స్వర్ణాభరణ శోభితులై శ్రీనివాసస్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తజన కోటి గోవిందా అంటూ నామస్మరణ చేస్తూ కళ్యాణోత్సవంను అత్యంత భక్తి శ్రద్ధలతో తిలకించి తన్మయత్వం పొందారు. ముహూర్త ఘడియల సందర్భంగా టిటిడి అర్చకులు స్వామి, అమ్మవార్లకు వివాహ వేడుకలు ఘనంగా జరిపారు. టిటిడిలో సంప్రదాయ బద్ధంగా సాగే రీతిలోనే స్వామి వారి కళ్యాణోత్సవంను నిర్వహించారు. కళ్యాణోత్సవంకు హాజరైన దంపతులు సంప్రదాయ రీతిలో వస్త్రాలు ధరించి హాజరయ్యారు. ఈ కార్యక్రమంను తిలకించేందుకు నియోజకవర్గంనుంచే కాక కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందిన భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. కళ్యాణోత్సవంకు చిత్తూరు ఎం.పి. రెడ్డెప్ప, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ హాజరయ్యారు.

**ఎమ్మెల్సీ భరత్‌చే పట్టువస్త్రాల సమర్పణ :**

శ్రీ బేటరాయస్వామి ఆలయంలో పెరటాసి నెల మూడో శనివారం నేపథ్యంలో స్వామివారికి చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ పట్టువస్త్రాలు సమర్పి ంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొండ కింద ప్రాంతంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హెచ్‌ఎం మురుగేష్, టౌన్‌బ్యాంక్ ఛైర్మన్ భాగ్యరాజ్, గోనుగూరు సర్పంచ్ డా॥ దీప్తి భాగ్యరాజ్, ఎంపిపి కుమారి అశ్విని, జడ్పీటిసి ఎడిఎస్ శరవణ, తీర్థగిరి, రమేష్, టెలికాం బోర్డు సభ్యుడు వెంకటేష్‌లు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు



తిరుచానూరు,అక్టోబర్ 8 ప్రభాతవార్త: తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారిని శనివారం ఉదయం తమిళనాడు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్ సెల్వం,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులు వేర్వేరుగా దర్శించుకున్నారు.అమ్మవారి దర్శనార్థం వచ్చిన వీరికి ఆలయ అధికారులు డిప్యూటీ ఈఓ లోకనాథం,ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శేషగిరి,ఏవిఎస్ఓ శైలేంద్రబాబు,ఆగమ సలహాదారు శ్రీనివా చార్యులు ఘన స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.దర్శనానంతరం వేద మండపంలో వేదాశీర్వచనంతో పాటు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందచేశారు.



## అంతరిక్ష పరిశోధనలో యువత భాగస్వామ్యం

**విద్యానికేతన్ విశ్వవిద్యాలయ కులపతి మంచు మోహన్‌బాబు**



చంద్రగిరి, అక్టోబర్ 2022 ప్రభాతవార్త:అంతరిక్ష పరిశోధనా రంగంలో యువత క్రియాశీల భాగస్వా మ్యం తీసుకోవాలని శ్రీ విద్యానికేతన్ యూనివర్సిటీ కులపతి డాక్టర్ మంచు మోహన్ బాబు ఆకాంక్షిం చారు. శ్రీ విద్యా నికేతన్ యూనివర్సిటీలో శనివారం అంతరిక్ష వారోత్సవాలను పురస్క రించుకుని స్పేస్ ఆన్ వీల్స్ 2022 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన అంతరిక్ష వారోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు, అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అంతరిక్ష ఉపగ్రహ వాహకనౌక నూనాలను, ఇస్రో పరిశోధనలను, అభివృద్ధికి సంబంధించిన డాక్యుమెంటరీని సందర్శకులకు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఇస్రో శాస్త్రవేత్త ఎల్.శ్రీనివాసులు, ఇస్రో సాంకేతిక బృందం, విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ నాగరాజ్ రామ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.నేసామూర్తి, డీన్స్, ఈ.సి.ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ గిరీష్, ఇతర విభాగాధితులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## కల్యాణ వెంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తజనసందోహం

చంద్రగిరి అక్టోబర్ 8 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం భక్తజనసందోహంతో పోటెత్తింది. ఆలయ అర్చకులు స్వామి వారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. పెరటాసి మాసం మూడవ శనివారం హైందవ సంప్రదాయంలో శ్రీవారి భక్తులకు అత్యంత పవిత్రమైన పండుగ కావడంతో భక్తులు స్వామి వారి దర్శనానికి బారులుతీరారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయ ఆవరణలో దీపారాధనలతో తమ మ్రొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్స్ మునిచెంగల్రాయులు, దాసరి రమణయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ కిరణ్‌కుమార్, అర్జితం ఇన్స్పెక్టర్ ధనశేఖర్ భక్తులకు దర్శన ఏర్పాట్లు గావించారు.

## కొబ్బరి-చెట్టుపై పడ్డ పిడుగు-ఉలిక్కిపడ్డ జనం..!

నారాయణవనం, అక్టోబర్ 8 ప్రభాతవార్త : మండలంలోని వెత్తలతడుకు వడ్డీఇళ్ల వద్ద శనివారం సాయంత్రం కొబ్బరి చెట్టుపై పిడుగు పడడంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. గత రెండు రోజులుగా వర్షం కురుస్తున్నది. శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అయితే వెత్తలతడుకు వద్ద రేషన్ డీలర్ శ్రీనివాసులుకు చెందిన ఇంటి పక్కనే వున్న పొలం వద్ద వున్న కొబ్బరి చెట్టుపై భారీ శబ్దంతో పిడుగు పడడంతో ప్రజలు ఒక్కసారిగా భయందోళనకు గురై అరుపుకేకలు పెట్టుకున్నారు. అయితే కొబ్బరిచెట్టు కేవలం 250 అడుగుల దూరంలో వున్నప్పటికి ఈ సమయంలో ప్రజలు ఎవ్వరు లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. అయితే చెట్టు మధ్య భాగం మాత్రం కాలిపోయింది.

## ఎర్రచందనం అక్రమ రవాణాపై టాక్స్‌ఫోర్స్ దాడి

**నలుగురు అరెస్టు, ఆరు ఎర్రదుంగలు స్వాధీనం**



రేణిగుంట, అక్టోబరు 8 ప్రభాతవార్త: ఎర్రచందనం అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎస్పీ మేడ సుందరరావు ఆదేశాల మేరకు డీఎస్పీ మురళీ కృష్ణ ఆధ్వర్యంలో రిజర్వుడ్ ఇన్స్పెక్టర్ సురేష్‌కు మార్ తమ సిబ్బందితో రెండు బృందాలుగా ఏర్పడి శుక్రవారం సాయంత్రం కూంబింగ్ నిర్వహించి మెరుపు దాడి చేయడంతో నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అదుపులోకి తీసుకుని, ఆరు ఎర్రదుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారుల సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు తమ సిబ్బందితో బృందాలుగా ఏర్పడి రేణిగుంట మండలం మామండూరు, కుక్కల దొడ్డి తడ కాలువ వద్ద ఓ బృందం, మంగళం సమీపంలోని బీటీ కాలనీ వద్ద మరో బృందం కూలింగ్ నిర్వహిస్తుండగా తడ కాలువ వద్ద ఎర్రచందనం దుంగలు మోసుకు వస్తున్న వారిని అధికారులు తమ సిబ్బందితో చుట్టు ముట్టారు. వారిలో కొంత మంది పారిపోగా ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద ఆరు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని తమిళనాడు రాష్ట్రం తిరుమన్నామలై జిల్లా జమున మత్తూరు, వేలూరు ప్రాంతాలకు చెందిన ఏళుమలై(24), పార్థీబన్ అన్నామలై(21), కుమార చిన్నయ్యన్(31)లుగా అధికారులు నిర్ధారించారు. మంగళం బీటు వద్ద చిత్తూరు జిల్లా సంతపేటకు చెందిన సెల్వం(40), రంపాలు, గొడ్డళ్లు తీసుకుని అడవిలోకి వెళ్లే ప్రయత్నం చేస్తుండగా పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శివయ్య సేవలో అతిధులు



శ్రీకాళహస్తి,అక్టోబర్ 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం అతిధుల తాకిడితో కిట కిట లాడింది. కాగా అతిధులతో అభిషేకాలుకూడా ఆలస్యం అవుతుంది. శనివారం సాయంత్రం అభిషేకాలు, దీపారాధన కూడా ఆలస్యం జరిగింది.ఈ నేపధ్యంలో భారత అల్‌రౌండర్ క్రికెటర్ కేదార్ జావేద్ కుటుంబసభ్యులతో శ్రీకాళహస్తీశ్వరుని సేవలో పాల్గొన్నారు. ఇక్కడ నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలను జరిపించుకున్నారు. వారికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.కాగా విశాఖపట్టణం కమాండర్ వైస్ అడ్మిరల్ శ్రీకుమార్‌నాయర్ కుటుంబసభ్యులతో విచ్చేసారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వారికి ఆలయ ఎసి మల్లికార్జున్ ప్రసాద్ స్వాగతం ఏర్పాటు చేసారు.

## బావిలో పడి యువకుడి మృతి.. ఫైర్ సిబ్బందిచే మృతదేహం వెలికితీత



కుప్పంరూరల్, అక్టోబర్ 8 ప్రభాతవార్త : అరవై అడుగుల లోతులో ఉన్న బావిలో ప్రమాదవశాత్తు పడి ఓ యువకుడు మృతి చెందగా శనివారం రాత్రి ఫైర్ అధికారులు బావిలో గాలించి మృతదేహాన్ని వెలికి తీశారు. మండలంలోని వేపూరు మిట్టపల్లికి చెందిన జగన్నాథ్ కుమారుడు పళని (25) శనివారం చెట్టిగానికుంట వద్ద ఉన్న బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడని ఫైర్ అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గ్రామస్తులు తమకు సమాచారం అందించడంతో హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని అతికష్టం మీద అరవై అడుగుల లోతులో ఉన్నబావి నుంచి మృతదేహంను వెలికితీశామన్నారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది రెడ్డెన్న, రామూర్తి, నరేష్, కృష్ణయ్య, లక్ష్మినారాయణ, సత్య, నరసింహులు పాల్గొన్నారు.